RNI NO: TEL/TEL/2009/28544

సంపుటి : 18
సంచిక : 149
Vol : 18
Issue : 149

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, శనివారం 8 ఆగస్టు 2026
Warangal, Saturday 8 August 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

www.epaper.
peoplesdairynews.com
www.peoplesdairynews.com

WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

# 'లెట్స్ స్నాప్'

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : డిజిటల్ పరిపాలనలో ఎప్పటికప్పుడు కొత్త దారులను వెతుక్కునే కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు దేశంలోని యువతతో మరింత వేగంగా, నేరుగా కనెక్ట్ అయ్యేందుకు సరికొత్త వ్యూహాన్ని ఎంచుకుంది. నేటి తరం జెన్–జీ డిజిటల్ ప్రియులు అమితంగా ఇష్టపడే 'స్నాప్‌చాట్' సామాజిక మాధ్యమంలోకి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా అడుగుపెట్టింది. సాంప్రదాయ వార్తా విధానాలకు స్వస్తి చెప్పి, కుర్రకారు భాషలో, ఆకర్షణీయమైన రీతిలో దేశ విదేశాంగ వ్యవహారాలను, తాజా సమాచారాన్ని అందించడమే ఈ సరికొత్త ప్రయోగం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా అవగతమవుతోంది. 'లెట్స్ స్నాప్' అంటూ పిలుపునిచ్చిన విదేశాంగ శాఖ ఈ సరికొత్త మైలురాయిపై విదేశాంగ మంత్రిత్వ (మిగతా 2లో...)

▸ యువతతో డిజిటల్ దౌత్యం
▸ స్నాప్‌చాట్‌లోకి కేంద్ర ప్రభుత్వం..
▸ సోషల్ మీడియాలో స్పీడు పెంచిన కేంద్రం
▸ మోదీ సందేశంతో పెంచుతున్న దూకుడు






# జెన్‌జీపై జగన్ గురి

రానున్న ఎన్నికలే లక్ష్యంగా వైసీపీ వ్యూహం!
ఢిల్లీ ఉద్యమం ప్రభావం ఏపీ రాజకీయాల్లోకి..
యువతే లక్ష్యంగా జగన్ రాజకీయ దూకుడు

2వ పేజీలో..



రాష్ట్ర ప్రజల కోసం వ్యక్తిగత అవమానాలైనా

# ఎదుర్కొంటా

కావేరి అంశంలో రాజకీయం చేసే ఉద్దేశం లేదు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్

పీపుల్స్‌డైరీ–చెన్నై: తమిళనాడు సీఎం విజయ్ శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడారు. కావేరి జల వివాదం నేపథ్యంలో.. తమిళనాడు ప్రయోజనాల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. కావేరి అంశంలో రాజకీయం చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదన్నారు. మేకదాతు డ్యామ్ అంశంలో రాష్ట్రం తమ హక్కులను ఎప్పటికీ వదులుకోదన్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రతిపక్ష నేత (మిగతా 2లో...)

# విచ్చలవిడిగా చెత్త దందా!

వరంగల్‌లో అక్రమ స్క్రాప్ సామ్రాజ్యం

▸ అనుమతులు లేవు... అడ్డుకునేవారు లేరు...
▸ చెత్త వ్యాపారంలో లక్షల రూపాయల లాభాలు
▸ నిబంధనలు చెత్తబుట్టలో.. స్క్రాప్ దందా రోడ్డుపై!
▸ పాత సీసాలు, ఇనుము, ప్లాస్టిక్, చెత్త, అట్టముక్కలతో యాపారం
▸ బల్దియా సంబంధిత అధికారుల మచ్చికతో జోరుగా బిజినెస్
▸ హంటర్ రోడ్డు, సంతోషిమాత ఆలయం టూ ఖమ్మం బైపాస్
▸ తాత్కాలిక అనుమతులతో అమ్మవారిపేటలో ఇనుము దందా
▸ గృహసముదాయాల్లో కుప్పలు తెప్పలుగా స్క్రాప్
▸ సమీప ప్రజలకు తప్పని ఇబ్బందులు
▸ చర్యలు తీసుకుని బహిరంగ ప్రదేశాలకు మార్చాలి

2వ పేజీలో..





# నేటి నుంచి గిగ్‌వర్కర్లు, డ్రైవర్ల సమ్మె

■ యాప్ ఆధారిత ఆన్‌లైన్ సేవలు బంద్
■ నిలిచిపోనున్న పలు సేవలు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో యాప్ ఆధారిత వాహన, ఫుడ్ డెలివరీ సేవలు ఆగిపోనున్నాయి. ఆగస్టు 8 నుంచి యాప్ ఆధారిత గిగ్ వర్కర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) బంద్‌కు పిలుపునిచ్చింది. శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. శనివారం నుంచి వాహన సేవలు, యాప్ ఆధారిత డెలివరీ సేవలు నిలిపివేస్తామన్నారు. ఓలా, ర్యాపిడో, ఉబర్.. స్విగ్గీ, జొమాటో, జెప్టో, ఇన్‌స్టామార్ట్ వంటి సేవలు నిలిచిపోనున్నాయి. క్యాబ్ సర్వీసులతో పాటుగా ఫుడ్ డెలివరీలు కూడా ఆగిపోతాయి. హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న గిగ్ ఆఫీసులో సమావేశమైన 16 సంఘాల నేతలు సమ్మె చేయాలని నిర్ణయించాయి. తమ సమస్యల్ని పరిష్కరించాలని ఎన్నో సార్లు ప్రభుత్వాన్ని కోరామని.. వారినుంచి సరైన స్పందన రాలేదన్నారు. అందుకే సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. యాప్ ఆధారంగా రవాణా సేవలకు సంబంధించి బేస్‌ఫేర్, ప్రతి కిలోమీటర్‌కు, ప్రతి (మిగతా 2లో...)



2వ పేజీలో..

మియావ్ అంటూ.. మనసు దోచే ముద్దుల పిల్లులు

ఇంట్లో ఇష్టజీవి.. వీధిలో నిరాశ్రయ జీవి

అల్లరి చేష్టలు.. ఆప్యాయపు చూపులు

స్వేచ్ఛే వాటి నైజం.. ప్రేమే వాటి బంధం

మానవుల జీవనంలో వాటికి ప్రత్యేక స్థానం

# మమతలు పంచే మార్జాలం

ఆగస్టు 8 – అంతర్జాతీయ పిల్లుల దినోత్సవం



# ఉచితాలతో తీవ్ర ఆర్థిక భారం

■ ఇలా అయితే రాష్ట్రాన్ని ఎలా నడుపుతారు?
■ అనర్హులు, ధనవంతుల జేబుల్లోకి ప్రభుత్వ సొమ్ము
■ ఉచితాలపై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : రాష్ట్రంలో అమలు జరుగుతున్న ఉచిత పథకాలు , ప్రభుత్వ పాలనా తీరు, సంక్షేమ పథకాల వర్గీకరణపై తెలంగాణ హైకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక కేసు విచారణ సందర్భంలో తెలంగాణ హైకోర్టు జస్టిస్ నగేష్ భీమపాక ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితులు, సమాజంలో భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు జస్టిస్ నగేష్ భీమపాక స్పష్టం చేశారు. ఉచిత పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను నిజమైన పేదలతో పాటు కోటీశ్వరులు, ధనికులు కూడా (మిగతా 2లో...)

పీపుల్స్‌డైరీ
వరంగల్
శనివారం, 8 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 149


# విచ్చలవిడిగా చెత్త దందా...

- వరంగల్ నగరంలో అక్రమంగా స్క్రాప్ సామ్రాజ్యం
- అనుమతులు లేవు... అడ్డుకునేవారు లేరు...
- చెత్త వ్యాపారంలో లక్షల రూపాయల లాభాలు
- నిబంధనలు చెత్తబుట్టలో.. స్క్రాప్ దందా రోడ్డుపై!
- పాత సీసాలు, ఇనుము, ప్లాస్టిక్, చెత్త, అట్టముక్కలతో యాపారం
- బల్దియా సంబంధిత అధికారుల మచ్చికతో జోరుగా బిజినెస్
- హంటర్ రోడ్డు, సంతోషిమాత ఆలయం టూ ఖమ్మం బైపాస్
- తాత్కాలిక అనుమతులతో అమ్మవారిపేటలో ఇనుము దందా
- గృహసముదాయాల్లో కుప్పలు తెప్పలుగా స్క్రాప్
- సమీప ప్రజలకు తప్పని ఇబ్బందులు
- చర్యలు తీసుకుని బహిరంగ ప్రదేశాలకు మార్చాలి

పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్



వరంగల్ నగరంలో పాడైపోయిన వస్తువులు (స్క్రాప్) వ్యాపారం విచ్చల విడిగా నడుస్తుంది, ప్రధానంగా నగరంలో సంతోషి మాత ఆలయం నుండి మొదలు పెడితే ఖమ్మం బైపాస్ ఉర్సు గుట్ట, తాళ్ళ పద్మావతి కళాశాల, నాయుడు పెట్రోల్ బంక్ కూడలి వరకు బాహాటంగానే నడుస్తుంది. తాగి పడేసిన బీరు సీసాలు, అట్ట ముక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, బాటిల్స్, ఇనుము లాంటి పనికి రాని వస్తువులను భారీగా సేకరించి లారీల్లో ఇతర ప్రాంత కర్మాగారాలకు తరలిస్తూ లక్షల రూపాయల వ్యాపారం కొనసాగుతుంది. ఇదంతా ఒకెత్తయితే కనీస అనుమతులు,జాగ్రత్తలు పాటించకుండా ఎకరాల భూముల్లో స్క్రాప్ మొత్తం నింపేస్తూ చుట్టూ పక్కన నివాసం ఉంటున్న వారికి ఇబ్బందుకు కలిగిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. బల్దియా కార్యాలయం నుండి ట్రేడ్ లైసెన్స్, అగ్నిమాపక అనుమతులు లేకుండా కనీసం వ్యాపారం నడుస్తుందంటూ బోర్డు సైతం లేకుండా గుట్టు చప్పుడు కాకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇక ఈ వ్యవహారం అంతా కూడా గృహ సముదాయాలు ఉన్నచోట కొన్ని ఉండగా, ప్రధాన రహదారుల్లో మరికొన్ని ఏకంగా కొన్ని వందల గజాలు అద్దెకు తీసుకుని వ్యాపారం నడిపిస్తున్నారు. ఇందుకు గాను కొందరు వ్యాపారులతో సంబంధిత అధికారుల మద్దతు సైతం లభిస్తుందని బాహాటంగానే ప్రచారం సాగుతుంది. గ్రేటర్ వరంగల్ అధికారులు తడి పొడి చెత్త సేకరణకు వాహనాలను ఏర్పాటు చేసి ప్లాంట్‌కి తరలించాలని మొత్తుకుంటున్నప్పటికీ సేకరిస్తున్న సిబ్బంది మాత్రం ప్రైవేటు వ్యాపారులతో చేతులు కలిపి స్క్రాప్‌ను అమ్మేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఇనుమును కుదించటానికి చిన్నపాటి పరిశ్రమలు నడిపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే భారీ ప్రాణ అస్థి నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రజలు వాపోతున్నారు. అటు బల్దియా ఇటు అగ్నిమాపక అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ జవాన్లు అనధికార స్క్రాప్ వ్యాపారుల వద్ద నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విశ్వసనీయ సమాచారం. ఉన్నతాధికారులకు తెలిసి ఈ తతంగం అంతా కూడా నడుస్తున్నట్టు సమాచారం.

**బల్దియా కమిషనర్ దృష్టి సారిస్తే వాస్తవాలు..**

వివరాలు : వచ్చే సంచికలో

# జెన్‌జీపై జగన్ గురి!

- రానున్న ఎన్నికలే లక్ష్యంగా వైసీపీ వ్యూహం!
- ఢిల్లీ ఉద్యమం ప్రభావం ఏపీ రాజకీయాల్లోకి..
- యువతే లక్ష్యంగా జగన్ రాజకీయ దూకుడు

పీపుల్స్‌డైరీ-ఏపీ బ్యూరో : 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ వ్యూహాన్ని ఇప్పటి నుంచే మార్చుకుంటోందా..? ఢిల్లీలో మొదలైన 'జెన్-జీ' ఉద్యమ ప్రభావం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని గల్లీ రాజకీయాల వరకూ చేరిందా..? వైసీపీ తాజా నిరసనలు, రాజకీయ కార్యక్రమాలను పరిశీలిస్తే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నిరుద్యోగులు, విద్యార్థులు, యువత సమస్యలను రాజకీయ అస్త్రాలుగా మలుచుకుంటూ వైసీపీ కొత్త వ్యూహానికి తెరతీస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన 'జెన్-జీ' ఉద్యమం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. విద్యార్థులు, యువత తమ సమస్యలపై పెద్ద ఎత్తున గళమెత్తడంతో రాజకీయ పార్టీలకు కూడా యువత శక్తి మరోసారి స్పష్టమైంది. యువతను కేవలం ఓటర్లుగా కాకుండా.. రాజకీయ ఉద్యమాల్లో కీలక భాగస్వాములుగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో దేశంలోని పలు రాజకీయ పార్టీలు యువతను ఆకర్షించే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. విద్య,



ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, నిరుద్యోగం వంటి అంశాలను ప్రధాన రాజకీయ అజెండాగా మార్చే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఇదే తరహా వ్యూహాన్ని ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ కూడా అనుసరిస్తోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఏపీలో డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ కొంతకాలంగా ఆందోళనలు నిర్వహిస్తోంది. అయితే తాజాగా ఆ పోరాటానికి 'జెన్-జీ' రంగు అద్దుతున్నట్లు కనిపిస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సంబంధించిన అంశాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. నిరసన కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు పార్టీ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటివరకు డీఎస్సీ వ్యవహారాన్ని ప్రధానంగా నియామకాలు, పరీక్షలు, నిరుద్యోగుల సమస్యల కోణంలో ప్రస్తావించిన వైసీపీ.. ఇప్పుడు దానిని యువత హక్కులు, భవిష్యత్తు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు వంటి విస్తృత అంశాలతో ముడిపెడుతోంది.

**జగన్ పర్యటనకు యువత స్పందనపై ప్రచారం**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి ప్రాంతంలో పొగాకు రైతులను పరామర్శించిన సందర్భంలో యువత నుంచి అనూహ్య స్పందన వచ్చిందని ఆ పార్టీ నేతలు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేశారు. జగన్ కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారని పేర్కొంటూ పోస్టులు పెట్టారు.

ఈ స్పందనను పార్టీ నాయకత్వం కూడా ప్రత్యేకంగా గమనించినట్లు తెలుస్తోంది. యువతలో ఉన్న అసంతృప్తిని కేవలం ఎన్నికల సమయంలో ఓట్లుగా మలచడం కాకుండా.. ఇప్పటి నుంచే వారిని పార్టీ రాజకీయ కార్యక్రమాల్లో భాగస్వాములుగా చేయాలన్న ఆలోచనకు ఇది బలం చేకూర్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# మమతలు పంచే మార్జాలం

- మియావ్ అంటూ.. మనసు దోచే ముద్దుల పిల్లులు
- ఇంట్లో ఇష్టజీవి.. వీధిలో నిరాశ్రయ జీవి
- అల్లరి చేష్టలు.. ఆప్యాయపు చూపులు
- స్వేచ్ఛే వాటి నైజం.. ప్రేమే వాటి బంధం
- మానవుల జీవనంలో వాటికి ప్రత్యేక స్థానం
- ఆగస్టు 8 - అంతర్జాతీయ పిల్లుల దినోత్సవం



పీపుల్స్‌డైరీ-హనుమకొండ : మనిషికి వేల ఏళ్లుగా తోడుగా ఉంటున్న జంతువుల్లో పిల్లులకు ప్రత్యేక స్థానం ఉంది. ఇంట్లో పెంపుడు జంతువుగా, వీధుల్లో మనతో పాటు జీవించే జీవిగా పిల్లులు మన చుట్టూ కనిపిస్తూనే ఉంటాయి. వాటి అల్లరి, చురుకుదనం, స్వతంత్ర స్వభావం ఎంతోమందిని ఆకట్టుకుంటాయి. పిల్లుల పట్ల ప్రేమ, వాటి సంక్షేమంపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 8న అంతర్జాతీయ పిల్లుల దినోత్సవం నిర్వహిస్తారు.

కుక్కలతో పోలిస్తే పిల్లులు కొంత స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. తమకు నచ్చినప్పుడు మనుషుల దగ్గరకు రావడం, ఆడుకోవడం, మళ్లీ తమ ప్రపంచంలోకి వెళ్లిపోవడం వాటి సహజ లక్షణం. అయితే మనుషులతో అనుబంధం ఏర్పడిన తర్వాత ఎంతో ఆప్యాయతను చూపిస్తాయి. పిల్లుల మియావ్ శబ్దం, తోక కదలికలు, చెవుల కదలికలు, శరీర భంగిమల ద్వారా అవి తమ భావాలను వ్యక్తపరుస్తాయి.

పిల్లులు కేవలం పెంపుడు జంతువులే కాదు. పర్యావరణ వ్యవస్థలోనూ వాటికి ప్రత్యేక పాత్ర ఉంది. ముఖ్యంగా ఎలుకలు, ఇతర చిన్న జీవుల సంఖ్యను నియంత్రించడంలో పిల్లులు సహజంగా సహాయపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లలో, ధాన్యం నిల్వ చేసే ప్రదేశాల్లో పిల్లులను పెంచడానికి ఇది కూడా ఒక కారణం.

**పిల్లలతో అనుబంధం**

పిల్లలతో కలిసి పెరిగే పెంపుడు పిల్లులు వారికి జంతువుల పట్ల ప్రేమ, బాధ్యత, దయ వంటి విలువలను నేర్పుతాయి. వాటికి ఆహారం పెట్టడం, నీరు అందించడం, పరిశుభ్రంగా ఉంచడం వంటి చిన్నచిన్న పనుల ద్వారా పిల్లల్లో బాధ్యతా భావం పెరుగుతుంది.

**వీధి పిల్లులపై శ్రద్ధ అవసరం**

పెంపుడు పిల్లులతో పాటు వీధుల్లో జీవించే పిల్లుల పరిస్థితిపైనా సమాజం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆహారం, నీరు, వైద్యం అందక అనేక పిల్లులు ఇబ్బందులు పడుతున్నాయి. వేసవిలో నీటి పాత్రలు ఏర్పాటు చేయడం, గాయపడిన పిల్లులకు చికిత్స అందించడం, సాధ్యమైనప్పుడు జంతు సంక్షేమ సంస్థల సహకారంతో టీకాలు, స్టెరిలైజేషన్ వంటి చర్యలు చేపట్టడం ద్వారా వాటి జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చు.

పిల్లిని పెంచుకోవాలనుకునేవారు కేవలం సరదా కోసం కాకుండా దీర్ఘకాలిక బాధ్యతగా భావించాలి. సరైన ఆహారం, స్వచ్ఛమైన నీరు, అవసరమైన టీకాలు, వైద్య పరీక్షలు, సురక్షితమైన వాతావరణం కల్పించాలి. పిల్లిని పెంచుకోవడం అంటే దానికి ఒక ఇల్లు ఇవ్వడం మాత్రమే కాదు.. జీవితాంతం సంరక్షణ అందించేందుకు సిద్ధంగా ఉండటం.

**మియావ్ వెనుక సందేశం**

అంతర్జాతీయ పిల్లుల దినోత్సవం కేవలం పిల్లుల అందాన్ని, అల్లరిని ఆస్వాదించే రోజు మాత్రమే కాదు. మన చుట్టూ ఉన్న జంతువులను ప్రేమతో, బాధ్యతతో చూసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేసే సందర్భం. మనిషి తన సౌకర్యం కోసం ప్రకృతిని మార్చుకుంటున్న సమయంలో ఇతర జీవులకు కూడా ఈ భూమిపై సమానంగా జీవించే హక్కు ఉందనే సందేశాన్ని ఈ రోజు అందిస్తుంది.

# ప్రభుత్వాల తప్పుల వల్లే చిక్కుల్లో అధికారులు

**ధిక్కరణ కేసుల్లో శిక్ష విధిస్తే జీవిత కాలం జైలులోనే**

**ఐఏఎస్ సందీప్‌కుమార్‌పై హైకోర్టు వ్యాఖ్యలు**

**ఆయనపై అనేక కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు**

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు కేటాయించాల్సిన బకాయి నిధుల విడుదల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు శుక్రవారం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. కంటోన్మెంట్ బోర్డుకు రావలసిన దాదాపు రూ. 33 కోట్ల స్టాంప్ డ్యూటీ సర్‌ఛార్జి బకాయిలను విడుదల చేయకపోవడంతో జే. రామకృష్ణ గతంలో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఉత్తర్వులపై కౌంటర్ దాఖలు చేయడానికి జులై 10వ తేదీన విచారణకు హాజరుకాకపోవడంతో.. సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియాపై హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆ ఆదేశాల మేరకు తాజాగా ఆయన స్వయంగా విచారణకు హాజరయ్యారు.

ఈ కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ నగేష్ భీమపాక నేతృత్వంలోని బెంచ్ అధికారుల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులను పదే పదే బోనులో నిలబెట్టడం తమకు ఎంతగానో బాధ కలిగిస్తోందని కోర్టు.. వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో ఆయనపై అనేక కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు అయ్యాయని గుర్తుచేశారు. ఆ పిటిషన్లు అన్నింటిలో గనక శిక్ష విధిస్తే.. ఆయన జీవిత కాలం జైల్లోనే గడపాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. పాలనాపరంగా ప్రభుత్వాలు చేసే తప్పులు, నిర్లక్ష్యం కారణంగానే బాధ్యతాయుతమైన అధికారులు ఇలాంటి చిక్కుల్లో పడుతున్నారని జస్టిస్ నగేష్ భీమపాక అభిప్రాయపడ్డారు.

ఈ వ్యాఖ్యలపై స్పందించిన అధికారి సందీప్ కుమార్ సుల్తానియా.. కంటోన్మెంట్ బోర్డుకు ఇప్పటికే రూ. 25 కోట్ల నిధులను విడుదల చేశామని చెప్పారు. మిగిలిన బకాయిలను కూడా విడతల వారీగా త్వరలోనే చెల్లిస్తామని ధర్మాసనానికి వివరణ ఇచ్చారు. ఈ సమాధానంపై సంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.



# ఉచితాలతో తీవ్ర ఆర్థిక భారం

(మొదటి పేజీ తరువాయి)

పొందుతుండటం వల్ల ప్రభుత్వంపై విపరీతమైన ఆర్థిక భారం పడుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

రైతుల మేలు కోసం వారికి పంట పెట్టుబడి సాయం అందించేందుకు తీసుకొచ్చిన రైతుబంధు వంటి పథకాలు ఎంతో మంచివే అయినప్పటికీ.. వాటిని సరైన అర్హులకు అందించకపోవడం వల్ల సంపన్నులు కూడా ఉచితంగా లబ్ధి పొందుతున్నారని హైకోర్టు ప్రస్తావించింది. ప్రతిదీ ఉచితంగా లభిస్తుండటంతో తానెందుకు పనిచేయాలి అనే ధోరణి ప్రజల్లో పెరుగుతోందని పేర్కొంది. ఈ ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి, ఇతర పనులకు కూలీలు దొరకని పరిస్థితి నెలకొందని.. దాంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జస్టిస్ నగేష్ భీమపాక ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలాగే ఉచితాల సంస్కృతిని కొనసాగిస్తూ పోతే చివరికి కుబేరుడి వద్ద ఉన్న ధనమంతా ఖర్చయిపోయి.. ఆయన కూడా పనికి ఆహార పథకం కింద కూలీ పనులకు రావాల్సిన పరిస్థితి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. దేశ పౌరుల సామాజిక బాధ్యత గురించి మాట్లాడిన జస్టిస్ నగేష్ భీమపాక.. ఒకప్పుడు గాంధీ, నెహ్రూ, ప్రకాశం పంతులు వంటి మహనీయులను చూసి దేశానికి మనమేమి ఇచ్చామని ఆలోచించేవాళ్లమని.. కానీ ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయి ఈ దేశం మనకేమిచ్చింది, ప్రభుత్వం మనకేమిచ్చింది అనే ధోరణే సమాజంలో ఎక్కువైందని వ్యాఖ్యానించారు.

# నేటి నుంచి గిగ్ వర్కర్లు, డ్రైవర్ల సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

నిమిషానికి న్యాయపరమైన ఛార్జీలను నోటిఫై చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. యాప్ ఆధారంగా సేవలు అందిస్తున్న డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, అన్ని రకాల గిగ్ వర్కర్లకు స్థిరమైన ఆదాయం వచ్చేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫారం వర్కర్స్ రూల్స్‌తో పాటుగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శాలకు తగిన విధంగా కనీస ఛార్జీలను నోటిఫై చేయాలంటున్నారు. కమర్షియల్ రిజిస్ట్రేషన్ మార్చకుండా ప్రైవేట్ వాహనాలను యాప్ ఆధారిత ప్రయాణికులు, రవాణా సేవలకు ఉపయోగించకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్ర ప్రజల కోసం వ్యక్తిగత అవమానాలైనా ఎదుర్కొంటా

(మొదటి పేజీ తరువాయి)



ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. కావేరి జల వివాదంపై చర్చించేందుకు ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. కానీ మేకదాతు డ్యామ్ అంశంలో కర్నాటక సర్కారు మాత్రం దూసుకెళ్తున్నట్లు చెప్పారు.

టీవీకే సర్కారుపై వస్తున్న విమర్శలకు విజయ్ కౌంటర్ ఇచ్చారు. తమిళనాడు జీవాధారం కావేరి నది అన్నారు. ఈ అంశాన్ని రాజకీయం చేసే ఆలోచన తనకు లేదన్నారు. తమిళనాడు జలహక్కుల కోసం కావేరి అంశంలో కర్నాటక సర్కారుతో చర్చలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం విజయ్ అన్నారు. అసెంబ్లీ పాస్ చేసిన తీర్మానాన్ని ప్రధాని మోదీకి పంపామని, మేకదాతు అంశంలో సభ్యులందరూ ఏకాభిప్రాయంతో తీర్మానాన్ని సపోర్టు చేశారన్నారు.

కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి కూడా లేఖ రాసినట్లు విజయ్ తెలిపారు. కావేరి అంశంలో సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసినట్లు చెప్పారు. 1969 నుంచి కర్నాటక డ్యామ్ ప్రాజెక్టుల అంశంలో తమిళనాడు చర్చలు నిర్వహిస్తోందన్నారు. కావేరి జల వివాదాన్ని పరిష్కరించేందుకు కర్నాటక సీఎంతో మాట్లాడనున్నట్లు తెలిపారు. దీని కోసం బెంగుళూరు కూడా వెళ్లనున్నట్లు సీఎం విజయ్ చెప్పారు. సమస్యలను పరిష్కరించుకునేందుకు శత్రు దేశాలు కూడా చర్చలు నిర్వహిస్తాయని, పక్క రాష్ట్రంతో మాట్లాడాలని నిర్ణయించానని, బెంగుళూరులో అవమానిస్తే ఏం చేస్తారని ప్రతిపక్షాలు అంటున్నాయని, అయితే తమిళనాడు ప్రజల కోసం అవమానాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు విజయ్ తెలిపారు.

# 'లెట్స్ స్నాప్'

(మొదటి పేజీ తరువాయి)

శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్) ద్వారా అధికారిక ప్రకటన చేశారు. "మేము ఇప్పుడు స్నాప్‌చాట్‌లో కూడా అందుబాటులో ఉన్నాం! మమ్మల్ని ఫాలో అవ్వండి.. విదేశాంగ రంగానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు, ఎక్స్‌క్లూజివ్ వీడియోలు మరియు తాజా అప్‌డేట్‌లను ఇంటరాక్టివ్ రూపంలో పొందేందుకు సిద్ధంగా ఉండండి. లెట్స్ స్నాప్!" అని ఆయన పిలుపునిచ్చారు. దీంతో కేంద్రం అందిస్తున్న అధికారిక సమాచారం ఇప్పుడు యువత చేతిలోని స్మార్ట్‌ఫోన్‌లలో మరింత వర్ణమయంగా మెరిసిపోనుంది.

సోషల్ మీడియాలో స్పీడు పెంచాలని ప్రధాని మోదీ సందేశం దేశంలో యువ ఓటర్లతో సంబంధాలను పటిష్టం చేసుకోవాలంటే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో యాక్టివ్‌గా ఉండటం ఎంతైనా అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే తన నాయకులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రధాని మోదీ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, షార్ట్ వీడియోల ద్వారా నిరంతరం యువతను ఉద్దేశించి ప్రసంగిస్తూ దూసుకుపోతున్నారు. గతంలో నీట్ పరీక్ష వివాదాల సమయంలో విద్యార్థుల నుంచి వెల్లువెత్తిన ఆందోళనలు, తదనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో, యువత ఆలోచనలను అర్థం చేసుకుంటూ వారి సందేహాలను ఎప్పటికప్పుడు తీర్చాల్సిన అవసరం ఉందనే కోణంలో ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంటోంది.

పాలనలోనూ యువత భాగస్వామ్యం సాధారణంగా విదేశాంగ శాఖ అంటే కేవలం అంతర్జాతీయ దౌత్య సంబంధాలు, ఒప్పందాలకే పరిమితం అనే భావన సాధారణ ప్రజల్లో ఉంది. అయితే స్నాప్‌చాట్ వంటి పాపులర్ యాప్‌లలోకి రావడం ద్వారా విదేశాల్లో భారతీయులకు అందిస్తున్న సేవలు, గ్లోబల్ డిప్లమసీ, ఇతర దేశాలతో భారత్ బంధం వంటి కీలక విషయాలను ఎంతో సరళంగా వివరించే అవకాశం ఏర్పడుతుంది. సోషల్ మీడియా ద్వారా పారదర్శకమైన పాలన అందించడంతో పాటు, దేశ భవిష్యత్తును నిర్దేశించే యువతను కూడా విదేశాంగ వ్యవహారాల్లో భాగస్వాములను చేయడమే ఈ డిజిటల్ ప్రయాణం ముఖ్య లక్ష్యం.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- మహిళా సాధికారతకు పెద్దపీట
- ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట:** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఎర్రగట్టుగుట్ట వెంకటేశ్వర కల్యాణ మండపంలో 65, 66వ డివిజన్లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి లక్ష్యంగా పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన పేద మహిళలు, మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు అందజేస్తామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మహిళకు చీరలు అందేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళల పాత్ర కీలకమని, పిల్లలను ఉన్నతంగా చదివించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను మహిళల పేరుతో మంజూరు చేస్తూ ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, 65వ డివిజన్ అధ్యక్షుడు సునీల్, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, మహిళా అధ్యక్షురాలు జోరిక పూల, మహిళా ఉపాధ్యక్షురా లు స్వాతి, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, మండల, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- బాలికల వైద్య కళాశాల వసతి గృహ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- నిర్మాణ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**భూపాలపల్లి ఆగస్ట్ 7 పీపుల్స్ డైరీ..** వైద్య కళాశాల బాలికల వసతి గృహ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బాలికల వైద్య కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, భవనం అంతర్గత (ఇంటీరియర్) పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున పనుల్లో వేగం పెంచి, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు నెలాఖరు నాటికి బాలికల వసతి భవనాన్ని పూర్తిస్థాయిలో అప్పగించాలని స్పష్టం చేశారు. బాలుర వసతి భవన నిర్మాణ పనుల్లో కూడా ఎలాంటి జాప్యం వహించవద్దని, దానిని సెప్టెంబర్ నెలాఖరు నాటికి సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. హాస్టల్ భవనంలో విద్యుత్తు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఎంతమేర విద్యుత్ అవసరమవుతుందో అంచనా వేసి, సమగ్ర నివేదికలు అందించాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా వేంకటేశ్వర రావు, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా వెంకటరత్నం, ఆర్ అండ్ బీ ఈ ఈ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల నాలుగు దశల ఉద్యమాలను విజయవంతం చేద్దాం



**ఆళ్ళపల్లి ఆగస్టు 7(పీపుల్స్ డైరీ) :** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆళ్లపల్లి మరియు ఆశ్రమ ఉన్నత పాఠశాల అనంతోగు, జి పి ఎస్ మైలారం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కోడు PRC సాధన కై నిన్నదిస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ అధికారి కొమరం శాంతారావు , మర్కోడ్ కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయు లు బి బాబులాల్ అనం తోగు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ భద్రమ్మ, ATA రాష్ట్ర నాయకు లు ముడిగ సమ్మయ్య, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిజోగ. రాంబాబు, ఉపాధ్యాయులు జి కుమార్ రాజా, పి వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ, బాలాజీ, ఇంగ్లీష్ వీరన్న హిందీ వీరన్న సాంబశివరావు, కృష్ణ, నాగమణి, మమతా రాణి, లీలావతి, లక్ష్మి, రాంబాబు, పద్మావతి, అభిజ్ఞ జ్యోతి, బాలాజీ, జి చందర్ రావు, హరినాథ్, బన్సీలాల్, సురేష్, ప్రవీణ్ కుమార్, చే నేశ్వర రావు, ఎస్.కె పాషా రేణుక, ప్రేమ్ కుమార్,కొమరం లాలయ్య భద్రమ్మ, వెంకట రమణ లక్ష్మీనారాయణ, సంపత్, శ్రీను, చిన్న, పూర్ణ, బిక్షమయ్య, స్వరూప, వసంతరావు, ప్రసాదరావు వసంత, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు, ఇప్పటినుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలోనల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. మండల కేంద్రంలో అధికారులకు మేమోరాండం సమర్పిద్దాంరాష్ట్ర, జిల్లా నాయకుల పర్యటనలుఇందిరా పార్క్ వద్ద మహా ధర్నాఅయినా ప్రభుత్వంస్పందించకుటే సెప్టెంబర్ లో చలో అసెంబ్లీ విద్యారంగ, పాఠశాల, విద్యార్థి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం,ఉపాధ్యాయులందరం పెద్ద సంఖ్యలో ఖ్రూజ పోరాట కార్యక్రమాలను విజయవంతం చేద్దాం. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుందాం.

# ప్రజల భద్రతే లక్ష్యం నేరాల నియంత్రణలో రాజీలేని పోలీసింగ్‌కు ప్రాధాన్యం

- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు న్యాయం
- సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలకు ఆదేశాలు
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,





**భూపాలపల్లి ఆగస్ట్ 7 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, జిల్లాలో నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ప్రతి కేసులో నాణ్యమైన, శాస్త్రీయ దర్యాప్తు నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సి.సి.టి.ఎన్.ఎస్. (2.0)లో ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి పారదర్శకత, సమాచార సమన్వయం, ప్రజలకు అందించే సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలపై గ్రామ స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి రవాణా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ కేసులు, వారెంట్లు, పిటిషన్ల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# బోనాల వైభవం.. తెలంగాణ సంస్కృతికి చిహ్నం

### మేడ్చల్ అక్షర డిగ్రీ కళాశాలలో భక్తి, సంప్రదాయాల సందడి



**మేడ్చల్, ఆగస్టు 7:(పీపుల్స్ డైరీ):-** తెలంగాణ సంస్కృతి, ఆచార సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రాష్ట్ర పండుగ బోనాలు కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు.. భక్తి, ఐక్యత, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. ఆ సంప్రదాయ వైభవాన్ని నేటి యువతకు చేరువ చేసే ఉద్దేశంతో మేడ్చల్ పట్టణంలోని అక్షర డిగ్రీ కళాశాలలో శుక్రవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం రంగురంగుల అలంకరణలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకోగా, విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, జానపద నృత్యాలు, భక్తి గీతాలతో కళాశాల ప్రాంగణం తెలంగాణ జానపద కళా వైభవాన్ని ప్రతిబింబించింది. బోనాల పండుగను విద్యాసంస్థల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో తమ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహనతో పాటు గౌరవ భావన పెంపొందుతుందని కళాశాల సీఈఓ జైపాల్ రెడ్డి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు సాంస్కృతిక విలువలను కూడా విద్యార్థులు అలవరచుకోవాలని, తెలంగాణ ప్రత్యేకతను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కూడా విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు మరింత శోభ తీసుకొచ్చారు. తెలంగాణ సంప్రదాయాలను పరిరక్షించడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయనే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా చాటింది. యువతలో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తూ, భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతను ప్రతిబింబించిన ఈ బోనాల వేడుకలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ భాస్కర్ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రభాకర్, డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపల్ శిల్ప, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బోగారంలో బ్యాటరీ దొంగల హల్‌చల్‌కు చెక్..!

### గ్రామస్తులు, లారీ ఓనర్ల ఆగ్రహం.. దేహశుద్ధి!



కీసర పోలీస్ స్టేషన్‌పరిధిలోని బోగారం గ్రామంలో బ్యాటరీ దొంగల వ్యవహారం కలకలం రేపింది. వాహనాల నుంచి బ్యాటరీలను చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బ్యాటరీలను దొంగిలిస్తున్న సమయంలోనే వారిని పట్టుకున్న స్థానికులు, లారీ ఓనర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పట్టుబడిన ఇద్దరిపై దేహశుద్ధి చేసినట్లు సమాచారం. వాహనాల బ్యాటరీలు వరుసగా చోరీకి గురవుతున్న నేపథ్యంలో ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పట్టుబడిన వ్యక్తుల వెనుక మరెవరైనా ఉన్నారా? గతంలో జరిగిన బ్యాటరీ చోరీల్లో వీరి పాత్ర ఉందా? అనే కోణంలో విచారణ జరగాల్సి ఉంది. పట్టుబడిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారా? చోరీకి గురైన బ్యాటరీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారా? అనే వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

# చేనేత కార్మికులకు ఘన సన్మానం



**హసన్‌పర్తి, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** జాతీయ చేనేత కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు ఘనంగా సన్మానం చేశారు. హసన్‌పర్తి పారిశ్రామిక ఉత్పత్తుల సంఘంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ డాక్టర్ దీవి అజిత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత రంగం ప్రతీకగా నిలుస్తోందన్నారు. చేనేత కార్మికులు తమ శ్రమతో దేశ వారసత్వాన్ని భావితరాలకు అందిస్తున్నారని కొనియాడారు. ఆధునిక కాలంలోనూ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం చేనేత కార్మికులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించి వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శేఖర్, కృపాకర్, తోట సంపత్, దికొండ భిక్షపతి, కనుకుంట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంట సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు.



**ఏటూరు నాగారం ఆగస్టు 07 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు తెలిపారు. మహిళల సాధికారత కోసం ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ఆసరా పెన్షన్లు, రూ.500 గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, గిట్టుబాటు ధర, రూ.5 లక్షల రైతు బీమా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆరోగ్య సహాయం వంటి కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు, గ్రామీణ పట్టణ అభివృద్ధి, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం,ప్రతి ఇంటి అభివృద్ధే మా లక్ష్యం అని చిటమట రఘు అన్నారు.

# కరెంట్ షాక్‌తో విద్యుత్ కార్మికుడు మృతి

### ఎల్లంపేట గుబ్బ కోల్డ్ స్టోరేజ్‌లో విషాద ఘటన



**మేడ్చల్, ఆగస్టు 7(పీపుల్స్ డైరీ):-** ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో గుబ్బ కోల్డ్ స్టోరేజ్లో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ విద్యుత్ కార్మికుడు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం, కోల్డ్ స్టోరేజ్‌లో ఫ్యూజ్ దెబ్బతినడంతో దానిని సరిచేసేందుకు ఆర్టీజీఎన్ సిబ్బందితో పాటు బెస్త నాగరాజు అక్కడికి వెళ్లారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేసిన వెంటనే ఆటోమేటిక్ జనరేటర్ ప్రారంభం కావడంతో, ఫ్యూజ్ పనులు నిర్వహిస్తున్న నాగరాజుకు అకస్మాత్తుగా కరెంట్ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన నాగరాజు ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం ఆయనను హుటాహుటిన మేడ్చల్‌లోని మెడినోవా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు అధికారుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## తాగునీటి కోసం ఎదురు చూపులు

**రాఘవేంద్ర నగర్‌లో నీటి సమస్య పరిష్కారానికి అధికారులకు కాలనీవాసుల వినతి**



**మేడ్చల్, ఆగస్టు 7(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూర్--కిష్టాపూర్ డివిజన్ రాఘవేంద్ర నగర్‌లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మాధురికి వినతిపత్రం సమర్పించారు. కాలనీకి సక్రమంగా తాగునీటి సరఫరా జరగడం లేదని, నాలుగు నుంచి ఐదు రోజులకు ఒకసారి కూడా నీరు అందడం లేదని వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కుటుంబాల అవసరాల కోసం ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, ట్యాంకర్ల ఖర్చు భరించడం సామాన్య ప్రజలకు భారంగా మారిందని వివరించారు. కొన్ని సందర్భాల్లో ట్యాంకర్లు కూడా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలం ముగిసినా నీటి కొరత కొనసాగుతుండటంతో ప్రజలు నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే శాశ్వత చర్యలు చేపట్టి నిరంతర నీటి సరఫరా కల్పించాలని కాలనీవాసులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మాధురి, సమస్యను పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యపాల్ రెడ్డి, సహ కార్యదర్శి రాంప్రసాద్, కౌన్సిలర్ నిశితా రెడ్డి, సచిన్, కోట రమేష్, రాజీ రెడ్డి, విజయ్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన మల్లారెడ్డి

**ఒరియంటేషన్ డే-2026లో నూతన విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం**



**మేడ్చల్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ):-** విద్యార్థి జీవితంలో కళాశాల ప్రవేశం ఒక కొత్త అధ్యాయానికి నాంది అని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రపంచ స్థాయిలో రాణించే అవకాశాలు అపారంగా ఉంటాయని మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని మైసమ్మగూడలో గల మల్లారెడ్డి విశ్వవిద్యపీఠం టెక్నికల్ క్యాంపస్ ఆడిటోరియంలో నిర్వహించిన ఒరియంటేషన్ డే--2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, కృషి, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మల్లారెడ్డి విద్యాసంస్థలు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాయని ఆయన వివరించారు. తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో నూతన విద్యార్థులు పాల్గొన్నారు. ఒరియంటేషన్ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా, ఉన్నత విద్యలో విజయం సాధించే మార్గాలను పరిచయం చేసేలా సాగింది.

## ఆకాకరకాయలు ( బోడ కాకరకాయలు )



ఆకాకర కాయలు ( బోడ కాకరకాయలు ) ఇవి వర్షాకాలంలో వ్యవసాయ పొలాల వద్ద ఎక్కువ విరివిరిగా లభిస్తాయి పోషక ఆహారాల కూరగాయలు విటమిన్లు విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ బి కాంప్లెక్స్ పోలేట్ సమృద్ధిగా ఉంటాయి ప్రోటీన్లు 100 గ్రాములకు 2-3 గ్రాముల రొటీన్ లభిస్తాయి ఇతర పోషకాలు ఫైబర్ పొటాషియం ఐరన్ మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి ఆరోగ్య ప్రయోజనాలు రోగ నిరోధక శక్తి పెంచడంలో జీర్ణక్రియ మెరుగుపరచడంలో చక్కెర రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయ పడతాయి వంటలు ఆకాకరపై కాయల ఫ్రై కూర పులుసు స్టెప్పు కర్రీ పప్పులలో కలిపి కూర వేపుడు వంటి వంటకాలు ఎంతో రుచిగా ఉంటాయి తక్కువ నూనెతో వండితే రుచి మాత్రమే కాకుండా మంచి పోషక విలువలు కూడా పొందుతారు ఆరోగ్యకరమైన ఆహారం ఏ కూరగాయలు వారానికి ఒకసారి లేదా రెండుసార్లు వంట చేసుకుని ఆరగించడం మంచిదని నిపుణులు చెప్తున్నారు

# కలెక్టరేట్‌లో రాష్ట్ర పండుగ బోనాలు వైభవంగా నిర్వహణ



- **భువనేశ్వరీ మాత ఆలయంలో ఘనంగా వేడుకలు**
- **పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో మారుమోగిన కలెక్టరేట్**

**మేడ్చల్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రాష్ట్ర పండుగ బోనాలను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకోగా, అధికారులు, ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించారు. కలెక్టరేట్‌లోని భువనేశ్వరీ మాత ఆలయంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బోనాల ఊరేగింపు వేడుకకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పోతరాజుల సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అధికారులు, ఉద్యోగులు బోనాలను కార్యాలయం నుంచి ఆలయం వరకు ఘనంగా తీసుకువెళ్లారు. మహిళా ఉద్యోగులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకుంటూ అమ్మవారికి సమర్పి ంచడం విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న రాష్ట్ర పండుగగా బోనాలు ప్రజల ఐక్యత, భక్తి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తు న్నాయని అధికారులు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ వేడుకలు ఉద్యోగుల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు తెలంగాణ సాంస్కృతిక వారసత్వంపై గౌరవాన్ని మరింత పెంపొందించాయి. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు.

# గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేస్తున్న కేంద్రం

- **జైల్ భరోతో పేదల సత్తా చాటాలి: వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు**



**సింగరేణి(కారేపల్లి) ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే విధానాలను అవలంబిస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జైల్ భరో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కారేపల్లి మండల కేంద్రంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర రావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. గ్రామీణ పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కొత్త బిల్లుల పేరుతో ఉపాధి అవకాశాలను తగ్గించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతోందని విమర్శించారు. ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులకు రక్షణగా ఉన్న కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగాజ్ తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను కేంద్రం అనుసరిస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పేదల ఐక్యత, సత్తాను చాటాలని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కే. నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కేసగాని ఉపేందర్, ఎనమనగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం, పాసిని నాగేశ్వరరావు, నాగమణి, కమల, రాధ, హుస్సేన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి నుంచి ఉపాధ్యాయ హక్కుల పోరాటం వరకు టీయూటీఎఫ్

- **15 ఏళ్ల ప్రస్థానం 16వ వసంతంలోకి అడుగుపెట్టిన తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్**
- **ఘనంగా కీసరలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**మేడ్చల్, ఆగస్టు 7:(పీపుల్స్ డైరీ):-** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను బలపరుస్తూ, ఉపాధ్యాయ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకురావాలనే లక్ష్యంతో 2011 ఆగస్టు 7న ఏర్పడిన తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) నేడు 15 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 16వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కీసర మండలం రాంపల్లి గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉద్యమ అవసరాల నుంచి పుట్టిన సంఘం తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్య రాష్ట్రానికి మద్దతుగా వ్యవహరించిన ఏపీయూటీఎఫ్‌కు భిన్నంగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా టీయూటీఎఫ్ ఆవిర్భవించింది. తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయుల గొంతుకగా నిలుస్తూ, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పలు కార్యక్రమాలు చేపట్టి ఉద్యమానికి బలమైన మద్దతు అందించింది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కూడా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా తన పోరాటాన్ని కొనసాగిస్తోంది. పతాకావిష్కరణతో ప్రారంభమైన వేడుకలు ఈ సందర్భంగా టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు (ఆర్‌వీ) సంఘ పతాకాన్ని ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ఆయన, సంఘం అనుక్షణం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేస్తూ, వారి హక్కుల సాధనకు అంకిత భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే సంఘ బలోపేతానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి కీలక డిమాండ్లుప్రస్తుత రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 51 శాతం పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, అలాగే బకాయిలో ఉన్న ఆరు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీయూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులను సాధించే వరకు సంఘం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఐక్యతకు ప్రతీక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంబల్ల రాజు, జిల్లా గౌరవాధ్యక్షులు నూకల నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోహన్ బాబు, కీసర మండల అధ్యక్షులు శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి పెద్దోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రాచకొండ ఆనంద్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొని టీయూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయ ఉద్యమాలకు టీయూటీఎఫ్ వేదిక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పుట్టిన టీయూటీఎఫ్, రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యా వ్యవస్థ బలోపేతం, ఉద్యోగ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న సంఘంగా గుర్తింపు పొందింది. 16వ వసంతంలోకి అడుగుపెట్టిన టీయూటీఎఫ్ భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయుల హక్కుల సాధనలో కీలక పాత్ర పోషించాలని నాయకులు ఆకాంక్షించారు.



# ఆగస్టు 10న జైల్‌భరోను జయప్రదం చేయాలి..




**మునగాల :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న కోదాడలో నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో అఖిల భారత కిసాన్ సభ, సీఐటీయూ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. శుక్రవారం మునగాలలో చందా చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం, కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల మండల కమిటీ సమావేశంలో శ్రీరాములు మాట్లాడారు. విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతున్నాయని, ఫలితంగా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల రుణాలను మాఫీ చేసేందుకు రుణ విమోచన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు, నూతన విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులను తగ్గించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, షేక్ సైదా, మండల కమిటీ సభ్యులు డి. స్టాలిన్‌రెడ్డి, వి. వెంకన్న, ఎం. వెంకటాద్రి, బి. కృష్ణారెడ్డి, ఎస్. నరసయ్య, ఎస్. పిచ్చయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

**భూపాలపల్లి ఆగస్ట్ 7 పీపుల్స్ డైరీ..** రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజన్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, విద్యార్థులకు యూనిఫాంలు కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగును పెంచే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితి భవిష్యత్తులో రైతులకు నష్టాన్ని కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి రైతుకు స్పష్టమైన సందేశం చేరేలా వ్యవసాయ అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

ప్రస్తుతం సాగునీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మరో 15 రోజుల పాటు అన్ని ప్రధాన ప్రాజెక్టుల నీటి మట్టాలను సమీక్షించిన అనంతరం పరిస్థితులకు అనుగుణంగా సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోకి వస్తున్న నీటి ప్రవాహాలను బట్టి అందుబాటులో ఉన్న ప్రతి జల వనరును నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని



నీటిపారుదల ప్రాజెక్టుల నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ జరగలేదని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్రంలోని 1.05 కోట్ల రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఆగస్టు 15వ తేదీ నుంచి తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ

ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణ ప్రణాళికను యథావిధిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నయ పంటలకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను రైతులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 99,81,167 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 15 తర్వాత వర్షపాతం మరింత తగ్గే అవకాశమున్నందున ప్రతి జిల్లాలో సాగునీటి సలహా సమావేశాలు నిర్వహించి నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్ సరఫరాపైనా ప్రభావం ఉండే అవకాశమున్నందున నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వరి సాగును మరింత పెంచవద్దని స్పష్టం చేశారు .ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 35 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, అది మరింత పెరగకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. కంది, పెసర, మినుములు తదితర పప్పుధాన్యాల విత్తనాలను సమృద్ధిగా నిల్వ ఉంచామని, ఇప్పటికే రైతులకు పంపిణీ ప్రారంభించామని తెలిపారు.

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన6 కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ

శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం వచ్చే నెల నుంచి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున పంటల సాగులో కంటింజెన్సీ ప్రణాళికలు, పంటల వైవిధ్యీకరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. వరి సాగులో కనీసం 50 శాతం విస్తీర్ణాన్ని ప్రత్యామ్నయ పంటల వైపు మళ్లించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 15 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు, కంది, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలు తదితర పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఇందుకు ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. వనమహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసి నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీఆర్ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా ఈ కాలంలో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో పాం పాండ్స్, ఇంకుడు గుంతలను నిర్మించాలని ఆదేశించారు. ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, కొత్త చేయూత పెన్షన్ల అర్హుల జాబితాను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి వచ్చే నెల నుంచి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో సీసీఎఫ్ ప్రభాకర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ పాలనలో ప్రజల అవస్థలు..మోడీని గద్దె దింపే వరకు సిపిఐ పోరు

- సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
- ముల్కనూర్ లో సిపిఐ పాదయాత్రలో చాడ

**బీమదేవరపల్లి ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ ):**దేశంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహిస్తుందని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలే దాని పతనానికి దారి తీస్తుందని, దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర 2వ రోజు ముల్కనూర్ లో ప్రచార జాత పాదయాత్ర సహకార బ్యాంకు నుండి కొత్తపల్లి వరకు ఉత్సాహపూరితంగా సాగింది. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అంబేద్కర్ విగ్రహంకు పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని అయిందా అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీస్తుందని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని,



సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని అన్నారు. సహజ వనరులను కార్పొరేట్ మిత్రులు అదానీ, అంబానీ లకు కట్టబెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, విద్య, ఆరోగ్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, దళితులపై, మహిళలపై అకృత్యాలను, దాడులను నిలిపివేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంకై ఆగస్టు 6 నుండి దేశవ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలో దేశంలో మార్పు కోసం మహా ర్యాలీతో ముగుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సిపిఐ పోరు ప్రచార జాత పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, ఎన్ ఎ స్టాలిన్, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, శనిగరపు రాజ్ కుమార్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్, బీమదేవరపల్లి మండల కార్యదర్శి అదరి రమేష్, మండల నాయకులు కొంగల రామచంద్ర రెడ్డి, కంవంపల్లి కిషన్, రాగుల చంద్రయ్య, చిలక శ్రీను, నిమ్మల మనోహర్, మాలోతు మంగ, మమత, కుడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ: ఎమ్మార్పీఎస్ నాయకులు



**భీమదేవరపల్లి ఆగస్టు 07:(పీపుల్స్ డైరీ ) :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని అంబేద్కర్ కూడలి వద్ద "ఆరోగ్యశ్రీ పథకం సాధన దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ మాట్ల వెంకటస్వామి మాట్లాడుతూ... 2004లో గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారుల కాపాడేందుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహోద్యమం జరిగిందని గుర్తుచేశారు. ఆ ఉద్యమ ఫలితంగానే నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరుపేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించే "ఆరోగ్యశ్రీ పథకం" రూపుదిద్దుకుందని స్పష్టం చేశారు. సమాజంలో మానవీయ కోణంలో జరిగే అనేక పోరాటాలకు మందకృష్ణ మాదిగ ఆద్యుడని కొనియాడారు. కేవలం ఆరోగ్యశ్రీ మాత్రమే కాకుండా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్ల పెంపు కోసం పోరాడిన ఘనత ఎమ్మార్పీఎస్, మాదిగ దండోరా ఉద్యమానికే దక్కుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకట్ స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు సిక సురేష్, భీమదేవరపల్లి కో-ఇన్‌చార్జ్ వేల్పుల ప్రశాంత్ మాదిగ, సీనియర్ నాయకులు ఐలపాక స్వామి, వికలాంగుల పోరాట సమితి మండల అధ్యక్షుడు పెండాల కుమారస్వామి, బహుజన నాయకులు బుస్మల్ల రాజు, వెంకన్న, రాజన్న, గజ్జల వెంకటస్వామి, ఆంజనేయులు, మాడుగుల అశోక్, పవర్ నందుల సురేష్, మాడుగుల ప్రభుదాస్, కాదాస్ ప్రవీణ్, నాగిన్ల చందర్, నాగిన్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సేవలు చిరస్మరణీయం

### ఏటూరు నాగారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నివాళులు.



**ఏటూరు నాగారం ఆగస్టు 07 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ఉద్యమ నేత, దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యేపెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఏటూరు నాగారం బిఆర్ఎస్ నాయకులు అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ములుగు జిల్లాకు సేవలు మరువలేనివని, గ్రామంలోని దళిత కుటుంబాలకు 3ఎకరాల చొప్పున భూమి ఇచ్చి పట్టాలు, తన నియోజకవర్గంలోని గ్రామంలో సిసి రోడ్లు వేసిన చిరస్మరణీయుడని ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కర్ర రవీందర్, ఎండి కాజా పాషా, తాడూరి రఘు, గండేపల్లి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బెజగాంలో అమ్మవారి జాతర సందడి

### భక్తిశ్రద్ధలతో ఘనంగా మహిషాసుర మర్దిని ఉత్సవాలు



**గజ్వేల్:** గజ్వేల్ మండలం బెజగాం గ్రామంలో మహిషాసుర మర్దిని ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామ ప్రజలకు ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో ప్రతి కుటుంబం సంతోషంగా, ప్రశాంతంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. మహిషాసుర మర్దిని ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో బెజగాం గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమంలో నాయకులు రమేష్ గౌడ్, అహ్మద్, శివకుమార్, వెంగల స్వామి, చిట్కూల మధుసూదన్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, మహిపాల్, కరుణాకర్, సాయి మహేష్ తదితరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలి




**నారాయణపేట, ఆగస్టు 7 :** నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నారాయణపేట జిల్లాను కరువు జిల్లా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా మరికల్ మండల కేంద్రంలో సిపిఐ పార్టీలో సారధ్యంలో రైతులతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నా నుద్దేశించి ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కరువు జిల్లాగా అదేవిధంగా వలసల జిల్లాగా నారాయణపేట జిల్లా ఉందని ఆయన వివరించారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రైతులపై చిన్నచూపు చూస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు రైతే రాజు అంటూ గొప్పలు చెప్తున్నారే తప్ప రైతుల కష్టార్జితం గుర్తించడం లేదని ఆయన విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అనేక మంది రైతులు ఆత్మహత్యలకు కూడా చేసుకున్నారని ఆయన వివరించారు. రైతులను గుర్తించి నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని లేనియెడల రైతుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బాలరాజు కథలన్నా వెంకటన్న నర్సింలు ఆశమ్మ కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు సేఫ్టీ పరికరాల వాడకంపై అవగాహన



**ఏటూరు నాగారం ఆగస్టు 07 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోఎస్విపురం ఏడిఈ ఉమారావు ఆధ్వర్యంలో ఎటునాగారం సబ్ డివిజన్ నందు వెంకటాపురం, ఎటురు నాగారం సబ్ డివిజన్ లోని ఖఅ-మీఖఅ, ఎమర్జెన్సీ బ్రేక్ డౌన్(జుదీణ) టీం మరియు స్పాట్ బిల్లర్ల కి విద్యుత్ ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు సేఫ్టీ పరికరాల వాడకంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏడిఈ ఉమారావు మాట్లాడుతూ తరచుగా జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు కి గల కారణాలను వివరిస్తూ, తిరిగి అటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండుటకు తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. మరియు కొత్తగా నియమితులైన ఎమర్జెన్సీ బ్రేక్ డౌన్ సిబ్బంది అందరికీ వోల్టేజ్ ఇండికేటర్స్ ఇవ్వడం జరిగింది. మరియు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏటూర్నగరం లైన్మెన్ రాజమల్లయ్య గారు మాట్లాడుతూ ఖఅ-మీఖఅ మరియు ఎమర్జెన్సీ బ్రేక్ డౌన్(జుదీణ) సిబ్బంది అందరూ సేఫ్టీ పరికరాలు అయినటువంటి ఎర్త్ డిశ్చార్జ్ రాడ్, సేఫ్టీ హెల్మెట్, సేఫ్టీ బెల్ట్, సేఫ్టీ జాకెట్ వంటివి వాడకపోతే ఎటువంటి అనర్థాలు జరుగుతాయో వారి గత అనుభవం నుంచి కొన్ని సంఘటనలు చెప్పి వివరించడం జరిగింది.

# మహిళపై దాడి.... కేసు నమోదు

**భీమదేవరపల్లి ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ ):** మహిళా సంఘం అప్పు విషయమై ఏర్పడిన వివాదంలో ఒక మహిళపై చెప్పుతో దాడి చేసి,బెదిరింపులకు పాల్పడిన ఘటనపై మహిళ సంఘం సభ్యురాలు పై ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బోడ స్వరూప 'వెలుగు నవ చైతన్య మహిళా సంఘం'లో సభ్యురాలు.గ్రామానికి చెందిన మాసాని శంకర్ ఇంటి వద్ద గ్రూపు సభ్యులు సమావేశమై అప్పుల లావాదేవీలపై చర్చిస్తుండగా, అదే గ్రూపునకు చెందిన దున్నపోతుల నాగమణికి అప్పు ఎక్కువగా ఉండడంతో దాన్ని త్వరగా చెల్లించాలని స్వరూప కోరారు.దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన నాగమణి "మీరు బలిసి ఉన్నారు" అంటూ అసభ్య పదజాలంతో దూషించింది. ఈ క్రమంలో ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించిన తోటి సభ్యురాలు పోలు లలితపై నాగమణి చెప్పుతో వీపుపై తీవ్రంగా కొట్టి, తలపై మన్ను పోసి దుర్భాషలాడింది. వారిని వారించేందుకు వెళ్లిన ఫిర్యాదుదారు బోడ స్వరూపపై కూడా నాగమణి "మీరంతా ఒకటే" అని చెప్పుతో దాడి చేయడంతో ఆమె చేతి మణికట్టుకు గాయమైంది. అంతేకాకుండా చంపుతానని బెదిరింపులకు దిగింది.బాధితురాలు బోడ స్వరూప ఇచ్చిన దరఖాస్తు మేరకు నిందితురాలు దున్నపోతుల నాగమణిపై చట్టరీత్యా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు.

# దోమల నివారణపై ఇంటింటి అవగాహన

**కీసర సర్కిల్‌లో 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమం**



**మేడ్చల్, ఆగస్టు 7(పీపుల్స్ డైరీ):-** మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌నగర్ డివిజన్‌లోని వైఎస్సార్ నగర్‌లో ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్రైడే--డ్రైడే' దోమల నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికి వెళ్లి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమకాటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే పాత్రలు, టైర్లు, కూలర్లు, ఇతర వస్తువులను తొలగించి దోమల పెరుగుదలను అరికట్టాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు "దోమ పుట్టకుండా -- దోమ కుట్టకుండా" అనే నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈ భాస్కర్, తిరుపతిరాజ్, వార్డు ఎంటమాలజీ సూపర్వైజర్లు శ్రీనివాస్, స్వామి, కాలనీ సభ్యులు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ ఎఫ్ సీ ఐ పెండింగ్ వివరాలపై జిల్లా కలెక్టర్ కు వినతి



**ఏటూరు నాగారం ఆగస్టు 07 (పీపుల్స్ డైరీ) :** శుక్రవారం రోజున ములుగు జిల్లా కేంద్రం లో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత ఆధ్వర్యంలో సీఎం ఆర్ ఎఫ్ సీ ఐ వివరాలు వివరాలు ఇవ్వాలని ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో పరిపాలన అధికారి రాజు కుమార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం జిల్లా మాజీ అధ్యక్షులు చింతలపూడి భాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి సంబదించిన సీ ఎం ఆర్ ను భారత ఆహార సంస్థ ఎఫ్ సీ ఐ కి తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సకాలంలో సరఫరా పెండింగ్ వివరాలు వెల్లడించడం మరియు సంబంధించిన Custom Milled Rice (CMR) ను పారదర్శక చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమం లోరాష్ట్ర బీజేపీ కార్యవర్గం సభ్యులు భూక్యా జహర్ లాల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు జినుకూల కృష్ణాకర్ రావు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీలమంతుల రవీంద్రచారి, నగరపు రమేష్ గిరిజన మోర్చా అధ్యక్షులు సిద్దబోయిన సురేందర్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గుగులోత్ స్వామి నాయక్, బీజేపీ మండలపార్టీ అధ్యక్షులు రాయంచు నాగరాజు, టౌన్ అధ్యక్షులు రాఖేష్ యాదవ్, తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, ఓబీసీ ఉపాధ్యక్షులు గడ్డం శ్రీధర్, జిల్లా కౌన్సల్ నెంబర్ గద్దల హరిబాబు, మండల ఉపాధ్యక్షులు దుర్గం దుర్గారావు కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఇర్సవడ్ల జగన్, కిసాన్ మోర్చా అధ్యక్షులు వార్డెల్లి వెంకన్న, మండల యువమోర్చ ప్రధాన కార్యదర్శి కొండగొర్ల. రాంబాబు, షోషల్ మీడియా కన్వీనర్ దుర్గం శ్రావణ్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# యాప్రల్ వార్డులో పచ్చదనానికి శ్రీకారం

**ప్రజలకు మొక్కల పంపిణీ చేసిన డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం**



**మేడ్చల్ ఆగస్టు 07(పీపుల్స్ డైరీ):-** మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు కీసర సర్కిల్ పరిధిలోని యాప్రల్ వార్డులో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్లాంటర్ బాక్సుల్లో నాటేందుకు స్థానిక ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ జి. రామలింగం మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ ఇంటి ముందు లేదా ప్లాంటర్ బాక్సుల్లో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనానికి మొక్కల పెంపకం ఎంతో అవసరమని తెలిపారు. ప్రజల సహకారంతోనే నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొని మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎన్నికైన సర్పంచు ఇంటిదగ్గర ....భర్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు పంపిణీ

- కన్మనూరు గ్రామ సర్పంచ్ లేకుండానే....
- కళ్యాణ లక్ష్మి చెక్కులు భర్త సమక్షంలో పంపిణీ...
- మన మరికల్ మండల అధికారుల పనితీరు ఇలా......
- భార్య సర్పంచ్ భర్త రాజకీయం....



**నారాయణపేట, ఆగస్టు 7 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్నికైన గ్రామ సర్పంచ్ సమక్షంలోనే ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు ఉన్న అట్టి ఆదేశాలను మండల స్థాయి అధికారులు తుంగలో తొక్కుతున్నారని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో జోరుగా చర్చించుకుంటున్నారు. నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం పరిధిలోని కనుమనూరు గ్రామంలో ప్రభుత్వ ఆధ్వర్యం లో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కమ్మనూరు గ్రామ సర్పంచ్ అంకిత సమక్షంలో చెక్కుల పంపిణీ చేయకుండా...... కనుమనూరు గ్రామ సర్పంచ్ భర్త నరేందర్ గౌడ్ సమక్షంలో మండల స్థాయి అధికారులు, కనుమనూరు గ్రామస్థాయి అధికారుల సమక్షంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేయడం ఎంతవరకు సమంజసం అంటూ మరికల్ మండల ప్రజలు అఖిలపక్ష నాయకులు జోరుగా చర్చిం చుకుంటు న్నారు. కన్మనూరు గ్రామ జిపిఓ నర్సింలు వివరణ అడగా..... కనుమనూరు గ్రామ సర్పంచ్ అంకితమ్మకు చెక్కుల పంపిణీ కార్యక్రమం పై సమాచారం ఇవ్వడం జరిగిందని ఆయన వివరించారు. కనుమనూరు సర్పంచ్ అంకితమ్మ రాలేదని, భర్త సురేందర్ గౌడ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం లో మరికల్ మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాల యంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కి హాజరు కావడం జరిగిందని ఆయన వివరించారు.

# భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**భూపాలపల్లి ఆగస్ట్ 7 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి మున్సిపాలిటీ సర్వసభ్య కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి వార్డులోని సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై వార్డు కౌన్సిలర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వార్డు కౌన్సిలర్ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి వార్డుకు యూనిట్ వారీగా బడ్జెట్ కేటాయించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములు, గ్రామకంఠ, రెవెన్యూ, అటవీ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు డి.ఏ.పీ., యూరియా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అలాగే ఇందిర మహిళా శక్తి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి వార్డులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశం లో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధికి కృషి..

**అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర..**



**రేగొండ ఆగస్టు 7 పీపుల్స్ డైరీ..** రేగొండ ,గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు .జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ గోరికోతపల్లి మండలం చిన్నకోడపాక గ్రామంలో సిసి రోడ్లకు శంకుస్థాపన,చేశారు.రేగొండ మండలం లింగాల గ్రామంలో సిసి రోడ్లకు శంకుస్థాపన, కనపర్తి గ్రామంలో పల్లె దవాఖాన , అంగన్వాడి కేంద్రాన్ని, రేపాక గ్రామంలో గ్రామపంచాయతీ, మహిళా సమైక్య నూతన భవనాలను ప్రారంభించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడం ధ్యేయం గా కృషి చేస్తామని రానున్న రోజుల్లో ప్రతి రేషన్ కార్డు లబ్దిదారునికి స్మార్ట్ కార్డ్ పంపిణీ కొత్త ఆసరా ఫెన్షన్ ఇవ్వబోతున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇప్పకాయల నర్సయ్య, జిల్లా ఎ ఎం సి చైర్మన్ గుటోజు కిష్టయ్య,కోటాంచ ఆలయ చైర్మన్ సంపత్ రావు,పి ఏ సీ ఎస్ చైర్మెన్ నడిపెల్లి విజన్ రావు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పున్నం రవి,మేకల బిక్షపతి, ప్రతాప్ రెడ్డి, రవీందర్ , మొట్టే కిరణ్,సురేందర్ రెడ్డి,ఆయా గ్రామాల ప్రజలు నాయకులు పాల్గొన్నారు..

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యం

**ముప్పు శ్రీనివాస్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు**



**ఎల్కతుర్తి ఆగస్టు 7 ( పీపుల్స్ డైరీ ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి (రోడ్స్) శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు.మండలంలోని గోపాల్ పూర్ నుండి జీలుగుల వరకు రోడ్డు మార్గంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.50 కోట్ల నిధులను మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలు తొలగిపోతాయని ముఖ్యంగా విద్యార్థులు రైతులు ఉద్యోగులు మరియు అత్యవసర సేవలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని కొనియాడారు.

# హిమ్మత్ నగర్ ఎం పి యు పి ఎస్ పాఠశాలలో ముందస్తు బోనాల పండుగ కార్యక్రమం




**వీణవంక ఆగస్టు 07( పీపుల్స్ డైరీ ) :** హిమ్మత్ నగర్ ఎంపీ యూపీఎస్ పాఠశాలలో ముందస్తు బోనాల పండుగ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోనె సత్యం మాట్లాడుతూ మా పాఠశాలలో ప్రతి ఏటా విద్యార్థులతో ముందస్తు బోనాల పండుగ కార్యక్రమాన్ని అలాగే పిల్లల తోటి ఆటల పోటీలు సాంస్కృతిక కళా పోటీలు నిర్వహించడం జరుగుతుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ జల శ్రీకాంత్ ఉప సర్పంచ్ మేక శ్రీనివాస్ వార్డు సభ్యులు చిలువేరు స్వప్న రమేష్ కర్ణకంటి నవ్య భాస్కర్ రెడ్డి దాసరి రమేష్ బొంతల రవీందర్ మ్యాక వెంకన్న గుంపుల రమ గట్టయ్య రావుసలా వినోద రాజేశ్వరరావు మాజీ ఉప సర్పంచ్ గెల్లు రమేష్ కర్ణకంటి భాస్కర్ రెడ్డి స్కూల్ చైర్మన్ రజిత వివో ఏ మౌనిక ఆశా వర్కర్ సరిత సదాశివరెడ్డి వీరన్న రాంబాబు ప్రధానోపాధ్యాయులు గోనె సత్యం నాగవెల్లి వేణు అడిగొప్పుల రవళి బొమ్మరవేణి రజిత నల్ల ప్రియాంక అంగన్వాడీ టీచర్లు లావణ్య స్వరూప ఆయమ్మ రాధమ్మ, సమ్మక్ గ్రామ ప్రజలు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# పోతిరెడ్డిపల్లి లో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం



**వీణవంక ఆగస్టు 07( పీపుల్స్ డైరీ) :**పోతిరెడ్డిపల్లి లో తల్లిపాల వారోత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మన గ్రామ సర్పంచ్ గజ్జెల మొగిలయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. "శిశువుల ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని, బిడ్డకు జన్మనిచ్చిన మొదటి గంటలోనే తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.ప్రతి తల్లి కూడా ఈ విషయమై అవగాహన కలిగి ఉండాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ గ్రామ పాలకవర్గం, గ్రామ కార్యదర్శి, ఆశా వర్కర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



## ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితమే ఆరోగ్యశ్రీ

**ఆత్మకూర్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాలతోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారని ఎమ్మార్పీఎస్ ఆత్మకూరు మండల కో కన్వీనర్ అర్షం సుధాకర్ అన్నారు. ఆరోగ్యశ్రీ సాధన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ జెండా గద్దె వద్ద శుక్రవారం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ మండల కో-కన్వీనర్ సుధాకర్ మాదిగ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ (ఏబీసీడీ) సాధనతో పాటు చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్సల కోసం ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. సమాజంలోని పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకం సాధనలో గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వం కీలకమని అన్నారు. అందుకే ప్రతి ఏడాది ఆగస్టు 7న ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బరుపట్ల కిరీటి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంగే మహేందర్, సామాజిక ఉద్యమకారుడు పెరుమాండ్ల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు కోడెపాక రాజు మాదిగ, కలకోట్ల రాజేష్ మాదిగ, కోడెపాక కుమార్ మాదిగ, నత్తి దేవేందర్ మాదిగ, బరుపట్ల చందు మాదిగ, తనుగుల శంకర్ మాదిగ, బరుపట్ల రాజు మాదిగ, పెరుమాళ్ల సదానందం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి



**ఆత్మకూర్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** ఆగస్టు 12న ఆత్మకూర్ మండల కేంద్రంలో నిర్వహించే తిరంగా ర్యాలీని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని బిజెపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతి ఇంటికీ చేర్చే లక్ష్యంతో నిర్వహించనున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం, తిరంగా ర్యాలీ విజయవంతానికి బీజేపీ ఆత్మకూర్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి డా. పెసరు విజయచందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. జాతీయ జెండాపై గౌరవం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. ఆగస్టు 10 నుంచి ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని గౌరవప్రదంగా ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 12న ఆత్మకూర్ మండల కేంద్రంలో నిర్వహించే భారీ తిరంగా ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, రైతులు తదితర అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ ఆత్మకూర్ మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ళ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా నాయకులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, ఏదులాపురం శ్రవణ్ కుమార్, ఇర్సడ్ల సదానందం, టింగిలికారి సత్యనారాయణ, సముద్రాల రవి, బొల్లపల్లి రాజు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బయ్య పైడి రవ్వ శివప్రసాద్, బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, కోశాధికారి జక్కుల మహేందర్, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్పణపల్లి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**కేసముద్రం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** విద్య మనిషి జీవితాన్ని మలుస్తుంది. విద్య ఒక్కటే పేదరికాన్ని పారద్రోలే ఆయుధం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నతంగా ఎదిగి దేశానికి, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తయారవ్వాలంటే చిన్నప్పటి నుంచే కష్టపడి చదవాలి" అని ఆర్టీఐ కార్యకర్త గంధం భరత్ అన్నారు.కేసముద్రం మండలం అర్పణపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు త్వరలో నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సంబంధించిన అధ్యయన పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలం "షిప్ స్కాలర్‌షిప్ అనేది కేవలం డబ్బు మాత్రమే కాదు. ఇది విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం అందుతుంది. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఇంజినీరింగ్, డిగ్రీ, ఇతర ఉన్నత విద్యలు చదవడానికి అవకాశం ఉంటుంది" అని వివరించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నరసింహరాజు ఉపాధ్యాయులు ప్రణయ్, శ్రీను, నరసింహ స్వామి, రమేష్, సురేష్, బి విజయ్ మోడెం రాజు, చిట్టె కుమార్, వార్డ్ నెంబర్లు గంధం ఉపేంద్ర వెంకన్న గంధసిరి సంతోష్,చిట్టె అశోక్ మోహన్, నరేష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12న అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**గోవిందరావుపేట, ఆగస్టు 7(పీపుల్స్ డైరీ) :** మండల పరిధిపసరగ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఈనెల 12న బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎన్నిక జరగనున్నట్లు తాత్కాలిక కమిటీ అధ్యక్షులు అంబాల మురళి, ఉపాధ్యక్షులు దార నిరంజన్‌లు తెలిపారు, పసర గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మురళి, కార్యదర్శి దార నిరంజన్ లో మాట్లాడుతూ సుమారు గత 18 సంవత్సరాల క్రితం పసర గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం కమిటీ నిర్ణయించడం జరిగిందన్నారు, కమిటీ ఏర్పాటనాటి నుండి అంబేద్కర్ యువజన సంఘం తరఫున ప్రజా సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆరోపించారు, ఇన్ని సంవత్సరాలైనా కమిటీ తిరిగివేకపోవడం ఎన్నికైన వారికి సంఘంపై పరిజ్ఞానం ఉన్నట్లా లేనట్లే అని వారు ప్రశ్నించారు, ఈనెల 12న జరగనున్న అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నికకు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ ఎన్నికలు జరగనున్నట్లు వారు తెలిపారు, సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు,



సమావేశంలో మాట్లాడుతున్న అంబాల మురళి దార నిరంజన్

# శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి!

**కార్మికుల హక్కులను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వం - ఏఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్**



**మట్టెవాడ, ఆగస్టు 07 (పీపుల్స్ డైరీ):** ఈఎస్ఐ ఆసుపత్రుల్లో కార్మికులకు 6 నెలల జీతాలు, ఈఎస్ఐ, పిఎఫ్ ఇవ్వాలని శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం గన్నారపు రమేష్ మాట్లాడుతూ ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న యాక్టివిటీ కార్మికులకు 6నెలల వేతనం రాక కార్మికులు సతమతమవుతున్నారు. ఎన్ని మార్లు అధికారుల దృష్టికి కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎక్కడి వేసిన గొంగడి అక్కడే వేసిన చందంగా ఉందన్నారు. కార్మికులకు వేతనాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఈఎస్ఐ ఆసుపత్రి అధికారులు స్పందించి కాంట్రాక్టర్ తో మాట్లాడి కార్మికుల ఖాతాల్లో వేతనం వేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్ల, మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడీ పెరుగుతుందని, పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగై మోడీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని రమేష్ ఆరోపించారు. ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు సమరశీల పోరాటాలకు కార్మిక -వర్గం సిద్ధం కావాలన్నారు. కార్మికుల సంక్షేమాన్ని చూడాల్సిన పాలకులు యాజమాన్యాల సంక్షేమాన్ని చూస్తున్నారని యాజమాన్యాలకు వేల కోట్ల రాయితీలు ప్రకటిస్తున్నా ప్రభుత్వాలు కార్మికుల గురించి ఆలోచించడం లేదన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ హాస్పిటల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.సతీష్, మధుసూదన చారి, జి.రజిత, ప్రవీణ్, రాజేష్, సుమలత, మౌనిక, భవితవ్య, ఏ.రజిత, ఎస్.రజిత, రేణుక, బి.సుమలత, మహేష్, ఆనంద్, ఐలయ్య, స్వప్న, రేణుక, చిన్నబాబు, అనిల్, అయిలయ్య, మానస, పుష్పనీల, హారతి, సునిత, రేవతీ, మల్లీకాంబ, మంజుల, అనిత, రమ, శ్యామల, సరిత, విజయ, రజిత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ ప్రకటించాలి

**యుఎస్‌పిసి భాగస్వామ్య పక్షాల డిమాండ్**



**కేసముద్రం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు పెండింగ్‌లో ఉన్న పిఆర్సిని తక్షణమే ప్రకటించాలని ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు కేసముద్రం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. యు.ఎస్.పి.సి భాగస్వామ్య పక్షాల నాయకులు గుండు సురేందర్ టి.పి.టి.ఎఫ్ భూక్య శ్రీను యు.టి.ఎఫ్ కీర్తి నాగయ్య బిడి.టి.ఎఫ్ లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. ఉపాధ్యాయులు దాచుకున్న జిపిఎఫ్ సొమ్ము కూడా ఇవ్వకపోవడం హాస్యాస్పదమని, ఆరు డి.ఏ.లు పెండింగ్‌లో ఉంచి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. టిపిటిఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ నాయకత్వంలో కేసముద్రం విలేజ్ పాఠశాలలో టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్. నర్సింహరాజు యూటీఎఫ్ మండల అధ్యక్షులు భూక్య శ్రీను నాయకత్వంలో అర్పణపల్లి పాఠశాలలో, డిటిఎఫ్ మండల బాధ్యులు గంగుల శ్రీను నేతృత్వంలో కేసముద్రం హైస్కూల్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను వెంటనే విడుదల చేయాలని జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవ్ బిల్లులను ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, న్యాయమైన హక్కుల సాధన కోసం టిపిటిఎఫ్ రాష్ట్ర పోరాట కమిటీ ఇచ్చే భవిష్యత్ ఉద్యమ కార్యాచరణలో మండలంలోని ఉపాధ్యాయులందరూ ఐక్యంగా పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్, యూటీఎఫ్, డిటిఎఫ్ మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసముద్రంలో ఆధార్ సెంటర్ తిరిగి ఏర్పాటు చేయాలి

**ఎంసిపిఐయు ఆధ్వర్యంలో నిరసన**




**కేసముద్రం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో ఉన్న ఆధార్ సెంటర్ ను తీసివేయడాన్ని నిరసిస్తూ, దానిని తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ జ్యోతిరావు పూలే సెంటర్‌లో ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసిపిఐయు పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ, కేసముద్రం మండలం 60 వేల జనాభాతో ఉందని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండవలసిన ఆధార్ సెంటర్ మండల కేంద్రంలో లేకపోవడం ప్రజలకు ఎంతో ఇబ్బందికరంగా ఉందని అన్నారు.ప్రభుత్వం ద్వారా కేటాయించిన పోస్ట్ ఆఫీసులో ప్రజలు ఆధార్ కార్డు అప్డేట్స్, పేర్ల సవరణలు, కొత్త కార్డులు చేయించుకునేవారని, కానీ ఇప్పుడు ప్రభుత్వ ఆధార్ సెంటర్ లేకపోవడం వల్ల ప్రజలు మండలం దాటి పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకన్న, రాజు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి!

**కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు అమలు చేయాలి-సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య**



**మట్టెవాడ, ఆగస్టు 07 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరంలో గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వేలాదిమంది పేద ప్రజలు ఉన్నారని ఇంతవరకు కూడా ప్రభుత్వం వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వలేదని ఇది చాలా దారుణమైన విషయమని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయం రామ సురేందర్ భవన్లో వరంగల్ టౌన్ పార్టీ శాఖ కార్యదర్శుల సమావేశం పార్టీ జిల్లా నాయకులు సింగారపు బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పేదలకు ఇండ్ల పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసిందని ఆ వాగ్దానాన్ని విస్మరించిందన్నారు. సుందరయ్య నగర్, కారల్ మార్క్స్ నగర్, ఎన్.పిఆర్ నగర్, ఓఎస్ నగర్, రఘునాథ్ నగర్, డీకే నగర్, మల్లు స్వరాజ్యం నగర్, జక్కలొద్ది, లెనిన్ నగర్, మైసయ్య నగర్, బీరన్నకుంట తదితర ప్రాంతాలలో గుడిసెలు వేసుకున్న పేదలు ఇండ్ల పట్టాల కోసం ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. వరంగల్ నగరంలోని కార్పొరేషన్ డివిజన్లలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద సర్వేలు నిర్వహిస్తున్నామని మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు, శ్మశాన వాటికల సమస్య తదితర సమస్యలు దృష్టికి వస్తున్నాయని వీటన్నింటినీ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని నాగయ్య తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సిహెచ్. రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఈసంపల్లి బాబు, నలిగంటి రత్నమాల, ఆరూరి కుమార్, వలదాసు దుర్గయ్య, యార ప్రశాంత్, బషీర్, శాఖా కార్యదర్శులు శ్రీనివాస్, రమ్య, కవిత, కళ్యాణి, ఉసిల్ల కుమార్, రవి, భవాని, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**మహబూబాబాద్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ మున్సిపాలిటీ 20వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏ పులిపాక నాగరాజు తండ్రి పులిపాక దుర్గయ్య, అలాగే సీపీఎం పార్టీ నాయకుడు తోళ్ళ బాబురావు ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులను మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ స్వగృహాలకు వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చిన ఆయన, భగవంతుడు మృతుల ఆత్మలకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబాలకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు నాయకులు రామరాజు యాకన్న, విజయ్, రమేష్, వినోద్, నరేష్, చిన్ని, మహిళలు, యువకులు ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాంధీపార్కు అభివృద్ధి పనులను త్వరగా చేయాలి : ఎమ్మెల్యే



**మహబూబాబాద్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33 వ వార్డులో గల గాంధీపార్క్, అంబేద్కర్ భవన్ అభివృద్ధి చేయాలని ఇటీవల స్థానిక 33వ వార్డు కౌన్సిలర్ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి,అజయ్ సారధి రెడ్డి పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో శుక్రవారం గాంధీపార్క్‌ను ఎమ్మెల్యే డాక్టర్ బి.మురళి నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా గాంధీ పార్కును పరిశీలించి అంబేద్కర్ భవన్, గాంధీ విగ్రహం అభివృద్ధి పనులు 50 లక్షలతో త్వరగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గాంధీ పార్క్ అంబేద్కర్ భవన్ గాంధీ విగ్రహం తదితర విషయాలపై స్థానిక 33 వ వార్డు కౌన్సిలర్ బి.అజయ్ సారధి రెడ్డితో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ బి.మురళి నాయక్ మాట్లాడుతూ వెంటనే గాంధీ పార్క్ అభివృద్ధికై 50 లక్షల తో వెంటనే అభివృద్ధి చేయాలన్నారు. అంబేద్కర్ భవన్‌కు 30 లక్షలతో మిగిలిన పనులు పూర్తి చేయాలన్నారు గాంధీ విగ్రహాన్ని పెద్దగా నిర్మించి వెంటనే నెలరోజుల్లో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నడిబొడ్డున 33 వ వార్డులో ఉన్న గాంధీ పార్క్ లో వాకింగ్ ట్రాక్ పూల మొక్కలతో అందంగా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో తీర్చిదిద్దేలా కృషి చేస్తామన్నారు పనులు పూర్తి కాకుండా ఉన్న అంబేద్కర్ భవన్ వెంటనే మిగతా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు గాంధీ విగ్రహం కూడా పెద్దగా నిర్మించి అభివృద్ధి చేయాలన్నారు. సందర్శించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతిరమేష్, సిపిఐ 33 వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, మున్సిపల్ డీఈ ఉపేందర్, వార్డు కౌన్సిలర్లు రేషపల్లి నవీన్, సరిత, బొల్లు రాజు, కాంగ్రెస్, సిపిఐ నాయకులు నీరుటి లక్ష్మీనారాయణ, చిదిరాల జ్ఞానేశ్వర్, పెరుగు కుమార్, మేక వీరన్న, వెలుగు శ్రావణ్, పద్మం ప్రవీణ్, యాకన్న, వీరన్న, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, ఎడ్ల రమేష్, హరిసింగ్, శ్యామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
శనివారం, 8 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 149


# దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక చేనేత రంగం

**మట్టెవాడ, ఆగస్టు 07 (పీపుల్స్ డైరీ) :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తవాడ జంక్షన్ లోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి అధ్యక్షుడు గంట రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మన దేశ గొప్ప సాంస్కృతిక వారసత్వానికి చేనేత రంగం ప్రతీకగా నిలుస్తోందని, మన చేనేత కళాకారుల నైపుణ్యంతో రూపుదిద్దుకునే వస్త్రాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి జీవనోపాధి కల్పిస్తున్న రంగాల్లో చేనేత ఒకటని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో చేనేత రంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ముద్ర రుణాలు, బున్కర్ సంక్షేమ పథకాలు, డిజిటల్ మార్కెటింగ్



వేదికలు, ఈ-కామర్స్ అవకాశాల ద్వారా నేతన్నలకు కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని రవి వివరించారు. సంప్రదాయ చేనేతను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందగట్ల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా చేనేత కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ సా, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు కందగట్ల సత్యనారా యణ, నాయకులు బైరి మురళి కృష్ణ, సముద్రాల పరమేశ్వర్, మాజీ కార్పొరేటర్ ఆడేపు స్వప్న, మాదాసి రాజు, టేకుమట్ల రేణుక, భాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, మిట్టపల్లి కపిల్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కోమాకుల నాగరాజు, మాచర్ల దీనదయాల్, కొంతం సంగీత్, కందగట్ల మల్లికార్జున్, ఆడెపు విక్రమ్, పేరాల భాస్కర్, బండి సుజాత, కట్ల రాధిక, మార్త ఉషారాణి, వల్లే రమేష్ యాదవ్, కొంపల్లి రాజు, మెంతుల యాద గిరి, కొత్త కొండ అరుణ్, బొడ్డు రాకేష్, అల్లి అజయ్, బి.శివశంకర్, బి.నగేష్, ప్రభాకర్ గుప్తా, ముత్తినేని లక్ష్మణ్, పిన్నోజు శ్రీనివాస్, అమర్, తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహాలకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే



**కేసముద్రం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన తరాల వీరేష్ తాతయ్య తరాల వెంకటయ్య మరణించిన విషయం తెలుసుకొని, వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేసముద్రం స్టేషన్ మాజీ ఎంపీటీసీ ఆగే వెంకన్న తల్లి ఆగే రామనర్సమ్మ మరణించగా, వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. భగవంతుడు మృతుల ఆత్మలకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు ఎండి నజీర్ టౌన్ పార్టీ అధ్యక్షులు వీరు నాయక్ జనరల్ సెక్రటరీ కమటం శ్రీనివాస్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు సుజాత హరి నాయక్, ఆగే రాము, వినయ్ రెడ్డి, మేకల శారద సురేష్, పురం రాజమణి రమేష్, దుడేపాక కృష్ణ యూత్ నాయకులుదండు శ్రీనివాస్, గూగులోత్ గణేష్, బానోత్ వెంకన్న, భీమ నాయక్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా మార్కపురి శివప్రసాద్



**భూపాలపల్లి, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** సమాచార హక్కు చట్టం జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాల పల్లి మండల అధ్యక్షుడిగా మార్కపురి శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన నేషనల్ చైర్మన్ డా. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు శ్రావంతి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు తోట సురేష్ జిల్లా కన్వీనర్ కాసాని దేవేం దర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిస్వార్థ సేవా దృక్పథంతో నిర్వర్తిస్తూ, సమాచార హక్కు చట్టం లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే మండల స్థాయిలో కమిటీలను బలోపేతం చేసి, సంస్థ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

## సెయింట్ మేరీస్ హైస్కూల్లో బోనమెత్తిన విద్యార్థులు



**గోవిందరావుపేట, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిసెయింట్ మేరీస్ హై స్కూల్లో శుక్రవారంపసరనా గారం గ్రామపంచాయతీలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పురస్కరించుకొని విద్యార్థులు ఒకరికొకరు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఘనంగాబోనాల పండుగను నిర్వహించారు. బోనాలతో వచ్చిన విద్యార్థి నులు సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్టీఫెన్ రెడ్డి బోనాలు తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని, విద్యార్థులు మన సంప్రదాయాలను తెలుసుకొని వాటిని గౌరవించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను వివరించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ



**మట్టెవాడ, ఆగస్టు 07 (పీపుల్స్ డైరీ) :** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ విద్యార్థులకు రాతపుస్తకాల పంపిణీ చేయబడినట్లు వరంగల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ అన్నారు. శుక్రవారం వరంగల్ కృష్ణాకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ఉచిత రాతపుస్తకాల(అన్ రూల్డ్ నోట్ బుక్స్) పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఐఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఈ విద్యా సంవత్సరం అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయని, ఉచిత పాఠపుస్తకాలతో పాటు విద్యార్థులకు రాసుకోవడానికి నోట్ బుక్స్, బ్యాగ్స్, షూస్ తదితర అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ పాఠ్య పుస్తకాలతో పాటు రాతపుస్తకాలు ఇవ్వడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు భారం తగ్గనున్నట్లు తెలిపారు. ఒక్కో విద్యార్థికి 12 లాంగ్ నోట్ బుక్స్ అనగా ఒక్కో విద్యార్థికి దాదాపు రూ.600 ఆదా కానున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయని అందులో మొత్తం 2,704 విద్యార్థులకు గాను 32,448 నోట్ బుక్స్ పంపిణీ అయినట్లు శ్రీధర్ సుమన్ తెలిపారు. ఈ సంవత్సరం మారిన పాఠ్యాంశాల ప్రకారం 80 మార్కులు వార్షిక పరీక్షల్లో, 20 మార్కులు అంతర్గత మూల్యాంకనం ఉన్నందున అంతర్గత మార్కులకు గాను ఈ నోట్ బుక్స్ సద్వినియోగం చేసుకోవాలని, అధ్యాపకులు మారిన పాఠ్యాంశాలు, సిలబస్ బోధనపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, లైబ్రేరియన్ వనమాల, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "జైలు భరో"ను విజయవంతం చేయాలి

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న**



**మహబూబాబాద్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించనున్న "జైలు భరో" కార్యక్రమంను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాలు, కార్మిక హక్కులు, ధరల పెరుగుదల, ప్రైవేటీకరణ వంటి ప్రజలను ప్రభావితం చేసే అంశాలపై నిరసన వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## గణపురం జడ్పీహెచ్ఎస్‌లో బోనాల వేడుకలు



**గణపురం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం దేసు సతీష్ కుమార్, పీడీ కోసరి సరిత ఆధ్వర్యంలో శుక్రవారం ఈ వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు తెలంగాణ సంప్రదాయ దుస్తులు ధరించి, భక్తిశ్రద్ధలతో బోనం ఎత్తుకుని పాఠశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మహాకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు పోతురాజు వేషధారణతో చేసిన విన్యాసాలు, ప్రదర్శించిన కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా హెచ్ఎం దేసు సతీష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు మన రాష్ట్ర పండుగలు, సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన పెంచేందుకే ఈ వేడుకలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ జీవన విధానంలో బోనాల పండుగకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భరత్ కుమార్, కుమారస్వామి, శకీరా బేగం, రాంబాబు, రమేష్, శ్రీనివాస్, దేవేందర్, దిల్షాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జైల్‌బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**సిపిఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి పిలుపు**



సమావేశంలో మాట్లాడుతున్న సోమ మల్లారెడ్డి.

**గోవిందరావుపేట, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** ఈ నెల 10న సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి పిలుపునిచ్చారు, శుక్రవారంమండల పరిధిమట్టుద్దుల గూడెం గ్రామ సుందరయ్య శాఖ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ గోవిందరావుపేట మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని మల్లారెడ్డి కోరారు. జైల్ బరో కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మట్టుద్దులగూడెం గ్రామంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ గృహాలు పెన్షన్లు ఇవ్వాలని దళితవాడలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి సులోచన ,జయమ్మ, రజిత, ఆంజనేయులు, పోశాలు పాల్గొన్నారు,

## ప్రజా పంపిణీ బియ్యం తూకంలో తేడా



**చిట్యాల, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండల తాసిల్దార్ కార్యాలయంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీ ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ శుక్రవారం తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బోర్డులు లేకపోవడం సమాచార హక్కు చట్టం ఉల్లంఘనేనని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు పౌరులు దరఖాస్తు చేస్తే సరైన సమాచారం సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని సమాచార హక్కు చట్టాన్ని తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. పౌరులు కోరిన సమాచారాన్ని పటిష్టంగా సకాలంలో అందించాలని కోరారు. అదేవిధంగా చిట్యాల మండల కేంద్రం పరిధిలోని రేషన్ షాపుల్లో ప్రజా పంపిణీలో ఇస్తున్న బియ్యం తూకంలో తేడా వస్తుందని ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీఐ మండల కన్వీనర్ ఏలేటి రామ్ రెడ్డి దేవరకొండ సత్యనారాయణ తిరుపతి పున్నం తిరుపతి చైతన్య గుప్తా పాల్గొన్నారు.

## కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిలువేరు సమ్మి గౌడ్ నియామకం



**కేసముద్రం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చిలువేరు సమ్మి గౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు డా. భూక్య ఉమా మురళి నాయక్ సూచనలతో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మి గౌడ్ మాట్లాడుతూ పార్టీ పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కేసముద్రం మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని ప్రజా సమస్యలపై పోరాడతానని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తానని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించేం దుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడి నియామ కంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, మిఠాయిలు పంచు కుని సంబరాలు జరుపుకున్నారు.

## పనుల్లో జాప్యానికి తావివ్వొద్దు : జిల్లా కలెక్టర్



**గణపురం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** వైద్య కళాశాలకు సంబంధించిన బాలికల, బాలుర వసతి గృహాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గణపురంలో నిర్మాణంలో ఉన్న బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాల కారణంగా బాహ్య పనులు మందగించినా, భవనం లోపలి పనులను వేగవంతం చేసి ఆలస్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు నెలాఖరు నాటికి బాలికల హాస్టల్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి అప్పగించాలని స్పష్టం చేశారు. బాలుర వసతి గృహ నిర్మాణం కూడా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొనసాగాలని, సెప్టెంబర్ నెలాఖరులోగా భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. హాస్టల్ భవనాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అవసరమైన విద్యుత్ లోడ్, మౌలిక వసతులపై సమగ్ర అంచనాతో నివేదిక సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా వేంకటేశ్వర రావు, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా వెంకటరత్నం, ఆర్ అండ్ బీ ఈ ఈ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**నర్సంపేట, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట డివిజన్ పరిధిలో ఇటీవల మరణించిన గౌడ కుటుంబాలను గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ శుక్రవారం పరామర్శించారు. దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామంలో మోకుదెబ్బ మండల కమిటీ అధ్యక్షుడు తడుక కొమురయ్య సోదరుడు రవీందర్ గౌడ్ ఐదవ రోజు కార్యక్రమానికి హాజరైన రమేష్ గౌడ్ నాయకులతో కలిసి మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు భార్య వరలక్ష్మీ, కుమారుడు గణేష్, అల్లుడు పోగాకు సురేష్‌లను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు,మోకుదెబ్బ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కందుల శ్రీనివాస్ గౌడ్, నల్లబెల్లి మాజీ ఎంపీపీ ఊడుగుల సునీత ప్రవీణ్ గౌడ్,దొనికెల సదానందం గౌడ్, గుండెబోయిన రవి గౌడ్, గుండెబోయిన రమేష్ గౌడ్,గొడిశాల రమేష్ గౌడ్,కక్కెర్ల రమేష్ గౌడ్,పొగాకు రమేష్ గౌడ్,సాంబయ్య గౌడ్, సమ్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో 114 పోస్టుల భర్తీ

**ఈనెల 17న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు**

**గణపురం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్, గౌరవ వేతనం ప్రాతిపదికన 114 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 10 ప్రొఫెసర్లు, 21 అసోసియేట్ ప్రొఫెసర్లు, 39 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 44 సీనియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ అండ్ వెనెరాలజీ, సైకియాట్రీ, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, ప్రసూతి-స్త్రీరోగ విభాగం, రేడియాలజీ, అనస్థీషియా, రెస్పిరేటరీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్ తదితర 21 విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు స్వీయ ధ్రువీకరణ చేసిన విద్యార్హతలు, అనుభవ ధ్రువపత్రాల ప్రతులతో ఈ నెల 17న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో నిర్వహించే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. పోస్టుల వారీ అర్హతలు, నిబంధనలు, ఇతర పూర్తి వివరాలు ఙఙఙ.స్త్రఎఎష్ట్రజూశ్రీ.ఙశీఎ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.



## బురద రోడ్డులో నాట్లు వేసి నిరసన

**ఏన్కూరు, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని జంగాల కాలనీలో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ ఇప్పటికీ కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు కాలనీకి వచ్చి విద్యుత్ స్తంభాలు, రోడ్లు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుంటున్నారని, ఎన్నికలు ముగిసిన అనంతరం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. కాలనీలో సరైన రహదారి లేకపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో రోడ్లు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇదే బురద రోడ్లపై నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మరోవైపు కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో చీకట్లోనే జీవనం సాగించాల్సి వస్తోందని, పాములు సంచరిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు. వెనుకబడిన జంగాల సామాజిక వర్గానికి చెందిన వారు కావడం వల్లే తమ కాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదని కార్మిక సంఘం నాయకులు ఇటికాల లెనిన్ ధ్వజమెత్తారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కాలనీలో తక్షణమే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు రహదారులను నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను ఆయన కోరారు.

## ఉద్యోగోన్నతి పొందిన పోలీసులకు సీపీ అభినందనలు



**ఖమ్మం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** వివిధ పోలీస్ స్టేషన్‌లలో హెడ్ కానిస్టేబుల్‌గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన 28 మంది పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారు భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్ళనున్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల బాధితులకు అప్పగింత



**ఖమ్మం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన సుమారు 17 మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం (సెయిర్ పోర్టల్ అలాగే ఐఎం ఈఐ ట్రాకింగ్) సహాయంతో పోలీసులు విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. వన్ టౌన్ సిబ్బంది, ఐటి కోర్ టీం సమన్వయంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఈ ఫోన్లను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారని,రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశామని తెలిపారు. ఇప్పటివరకు 613 ఫోన్లు అప్పగించినట్లు తెలిపారు.తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. నేటి ఆధునిక కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలకు కీలకమైన వనరు అని ఇన్స్పెక్టర్ అన్నారు.


## పంట కుంటల నిర్మాణంపై దృష్టి సారించండి

### రైతులకు అవగాహన కల్పించండి - డిప్యూటీ కమిషనర్ విద్యాలత



**ఏన్కూరు ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** జలసిరి పథకంలో భాగంగా చేపట్టిన పంట కుంటల నిర్మాణాలపై దృష్టి సారించాలని వీటిపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విద్యాలత అన్నారు. శుక్రవారం ఆమె భగవాన్ నాయక్ తండ, అక్కినాపురం తండాలలో పంట కుంటల నిర్మాణంపై రైతులతో మాట్లాడారు. గార్ల ఒడ్డులో అవెన్యూ, గ్రామపంచాయతీ ప్లాంటేషన్లను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సర్పంచ్ ,ఉప సర్పంచ్ ,పంచాయతీ కార్యదర్శి తో చర్చించారు. అనంతరం రేపల్లెవాడ గ్రామంలో వివో భవన నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు ప్రగతిని సమీక్షించారు. నిర్దేశిత గడువులోగా నివేదికలు సమర్పించాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. పింఛన్లు, ప్రజా ఫిర్యాదుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తూ వేగవంతమైన సేవలు అందించాలని మినిస్ట్రియల్ సిబ్బందిని ఆదేశించారు .ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ను భగవాన్ నాయక్ తండా సర్పంచ్ ధరావత్ మణి, రేపల్లె వాడ సర్పంచ్ అజ్మీర సురేష్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీలు శిరీష ,చలపతిరావు, డిఎల్పిఓ విజయలక్ష్మి, ఎండిఓ భాగ్యశ్రీ ,ఎంపిఓ జీవీఎస్ నారాయణ ,గార్ల ఒడ్డు సర్పంచ్ భూక్యా నర్సీ,ఏపీవో సూరయ్య ,ఏవో నరసింహారావు ,ఏఎంసి మాజీ చైర్మన్ లాలూ నాయక్ ,పంచాయతీ కార్యదర్శులు ,ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు ఫ్యాన్లు అందజేత



**ఏన్కూరు, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని మూల పోచారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్ విద్యార్థుల కు లివైరా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకు రాలు బానోత్ మనీషా లక్ష్మీ మదన్ లాల్ ఫ్యాన్లు అందజేశారు. వేసవిలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్పందించి ఫ్యాన్లను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో భోగిని బోయిన వెంకటేశ్వర్లు, వై. వెంకటేశ్వరావు, మధు, బండ రాంబాబు, పుల్లయ్య, మేడ వెంకటి పాల్గొన్నారు.

# ‘చేతిలో గొడుగు.. జనంతో అడుగు..!’

**ఖమ్మం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** ఆకాశం వర్షిస్తోంది... వాన తుంపరలు కాలనీ బాటలను తడుపుతున్నాయి... అయినా ఆ ప్రజా సంకల్పం ఆగలేదు! వర్షం పడుతున్నా ఏమాత్రం వెనకడుగు వేయకుండా, ఒక చేతిలో గొడుగు పట్టుకుని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగారు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి మంత్రి సాగించిన క్షేత్రస్థాయి పర్యటన పాలనకు ఒక కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది.



### వేడి టీ కప్పుతో ఆప్యాయ పలకరింపులు

హంగులు లేవు... ఆర్భాటాలు అసలే లేవు! పర్యటన మధ్యలో సాయిగణేష్ నగర్ వీధిలోని ఒక చిన్న టీ కొట్టు వద్ద మంత్రి ఆగిపోయారు. సామాన్య పౌరుడిలా అక్కడ ఉన్న బెంచ్ మీద ఆసీనులై, స్థానికులతో కలిసి వేడివేడి టీ తాగారు. ఆ తేనీటి కప్పు నురగల్లోంచే ప్రతి ఇంటా ఉన్న సమస్యలను ఆప్యాయంగా పలకరించారు. తాగునీటి తిప్పలు, కరెంట్ తీగల భయాలు, వర్షపు నీటి ఇబ్బందులను ప్రజలు మంత్రి ముందు ఉంచగా... ‘నేనున్నాను’ అంటూ భరోసానిచ్చారు. తమ ఊరి నేత తమ పక్కనే కూర్చుని టీ తాగుతూ కష్టసుఖాలు వినడంతో కాలనీవాసుల సంతోషం వ్యక్తం చేశారు.

### రూ.100 కోట్ల నిధులతో మోడల్ మున్సిపాలిటీగా ఏదులాపురం రూపకల్పన

ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు ఈ మంజూరు చేశారని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. గ్రామ పంచాయతీల కలయికగా ఏర్పడిన ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. వర్షపు నీరు నిలిచే లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత డ్రైనేజీ నిర్మాణాలు, తుమ్మ చెట్ల తొలగింపు, తాగునీటి సరఫరాను మెరుగుపరచడం వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని హామీ ఇచ్చారు.

### ప్రజా అవసరాలే ప్రాధాన్యం...

ఇందిరమ్మ ఇళ్లు, స్థలాల కోసం ప్రజలు సమర్పించిన వినతులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ నల్ల బ్యాడ్జీలతో నిరసన



**ఏన్కూర్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ):** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరై ,నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూల పోచారం పాఠశాల నందు జరిగిన నిరసన ప్రదర్శనలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సీని ప్రకటించాలని, పెండింగ్ డీఏలను,బిల్లులను విడుదల చేయాలని, సక్రమంగా హెల్త్ కార్డులను అమలు చేయాలని, గురుకుల,కేజీబీవీ, యుఅర్ఎస్,మోడల్ స్కూల్స్,ఎయిడెడ్, గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని, పండిట్స్,పిఈటి పోస్టులను అప్గ్రేడ్ చేస్తూ పదోన్నతులు కల్పించాలని, టిఆర్టి ల సర్వీస్ ను క్రమబద్ధీకరించాలని గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, పదోన్నతుల బదిలీల షెడ్యూల్ ను విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలకు నష్టదాయకంగా ఉన్న జీవో 25ను సవరించాలని కోరారు.ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్ చంద్ మూడ్ పుల్లయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగరాజు, ఉపాధ్యాయులు బి.శోభన్, బి.రవి కే.శ్యామల, ఎం.చందర్రావు, పి.శ్రీనివాస్, వి.రమేష్, బి.సింగ్య, జే.నాగేశ్వరరావు, బి.సక్రాం, డి.వెంకటరమణ, హర్యానాయక్,ఉషశ్రీ, నలిని,కపూర్య,వీరు కళ్యాణి పాల్గొన్నారు.



## వేటగాళ్ల ఉచ్చుకు బలైన ఆవు...

### గ్రామంలో విషాదం

**కరకగూడెం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని కన్నాయిగూడెం పంచాయతీ గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చుకు చిక్కి ఒక ఆవు దుర్మరణం చెందింది. స్థానిక రైతుకు చెందిన ఆవు గడ్డి మేతకు అడవికి వెళ్లగా, వేటగాళ్లు వన్యప్రాణులను పట్టేందుకు పాతిన ఉచ్చులో చిక్కుకుంది. ఉచ్చు నుండి బయటపడేందుకు విశ్వప్రయత్నం చేసినా గాయాల తీవ్రతతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న రైతు వెంటనే అక్కడికి చేరుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఉచ్చులు పాతిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామ పరిసరాల్లో గస్తీని పెంచాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## యువతి అదృశ్యం

**ఏన్కూరు, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** యువతీ అదృశ్యమైన సంఘటన ఇది స్థానిక పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి మండల పరిధిలోని టీఎల్ పేట గ్రామానికి చెందిన యువతీ ఖమ్మం లోని సోలార్ కంపెనీలో పనిచేస్తున్నది ఎప్పటి లాగానే ఈనెల 5వ తేదీన డ్యూటీ కి వెళ్తున్న అని చెప్పి వెళ్ళింది అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు కుటుంబ సభ్యులు వెతికిన ఫలితం లేకుండా పోయింది తల్లి లక్ష్మి శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎన్ సంధ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పినపాక బాషా హైస్కూల్‌లో ముందస్తు బోనాల సంబరాలు



**పినపాక, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** పినపాక మండలం బాషా హైస్కూల్‌లో ఆషాఢ మాస వేడుకల్లో భాగంగా ముందస్తు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. స్కూల్ విద్యార్థినులు సంప్రదాయ చీరలు, లంగా ఓణీలతో అలంకరించుకొని బోనాలు, వేపాకులతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. “నాజ్రా దీచీబూఖ” అనే ఫ్లెక్సీ ముందు అమ్మవారి చిత్రపటానికి, బోనాల కుండలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎక్సలెంట్ గ్రూప్ అఫ్ స్కూల్స్ కర్సపాడెంట్ ఎండీ యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలను విద్యార్థులకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు బోనాల పాటలు, డప్పు చప్పుళ్లతో సందడి చేశారు. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో పాటు సాంస్కృతిక వాతావరణాన్ని నింపింది. ఎక్సలెంట్ గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ ఎండీ ఖాదర్, కరెస్పాడెంట్ ఎండీ యూసఫ్ షరీఫ్ డైరెక్టర్స్ ఎండీ యాకుబ్ షరీఫ్, ముక్కు నర్సారెడ్డి, బండారి నరేంద్ర, ప్రిన్సిపాల్ అంకం సురేష్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని ఈ వేడుకలను అభినందించారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

## తిరుమలాయపాలెంలో 7 కోట్ల పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

**ఖమ్మం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసితండా వరకు రూ. 2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే హైదర్ సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో రూ. 20 లక్షల చొప్పున అంచనా వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనాలకు భూమిపూజ నిర్వహించారు.



### సమగ్ర అభివృద్ధే ధ్యేయం..

ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమపాళ్లలో పరుగులు తీయిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. తిప్పారెడ్డిగూడెం అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 35.55 కోట్లు, హైదర్ సాయిపేటకు రూ. 37 కోట్లు, పాతర్లపాడుకు రూ. 29.25 కోట్లు, రాజారాం గ్రామానికి రూ. 8.48 కోట్లు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. రైతాంగానికి మద్దతు ధరతో పాటు వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్, ఎకరాకు రూ. 6 వేల రైతు భరోసా జమ చేశామని గుర్తుచేశారు.

### ఇందిరమ్మ ఇళ్లు పారదర్శకం..

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎవరికీ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిపిఓ వినోద్‌మార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, తదితరులున్నారు.

# చనిపోయాకా గుర్తుండేలా బ్రతకడమే గొప్ప జీవితం!



**ఖమ్మం, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజు మరణించక తప్పదని, అయితే చనిపోయిన తర్వాత కూడా సమాజం తలుచుకునేలా, ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా జీవించడమే అత్యున్నతమైన జీవితమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామంలో శుక్రవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్వర్గీయ కన్నేటి వెంకన్న రెండో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకన్న విగ్రహాన్ని మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని కూడా మంత్రి ఆవిష్కరించారు.

### పదిమందికీ మేలు చేయడమే అసలైన సంపాదన

"మానవ జన్మలో సంపాదించే ఆస్తిపాస్తుల కంటే, నలుగురికి చేసిన సాయం, సంపాదించుకున్న అభిమానమే శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. కన్నేటి వెంకన్న తన జీవితాంతం ప్రజల కోసమే తపించారని కొనియాడారు. ఏ కష్టం వచ్చినా 'నేనున్నానంటూ' నిలబడ్డారని, అందుకే ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన రూపం విగ్రహమై ఈ ఊరిలో నిలిచిందన్నారు. ఆయన చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కన్నేటి వెంకన్న కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**చిట్యాల, ఆగస్టు 7(పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్ తండాకు చెందిన బానోతు భద్రు నాయక్ (56) అనే వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చిట్యాల ఎస్ఐ పొచంపల్లి సతీష్ తెలిపారు. లక్ష్మీపూర్ తండాకు చెందిన భద్రు నాయక్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు మద్యం తాగే అలవాటు ఉంది. శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒకటిన్నర గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చిన భద్రు నాయక్ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ఆయన భార్య జ్యోతి కిటికీలో నుంచి చూడగా ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. బాధితురాలి అరుపులు విని కుటుంబ సభ్యులు స్థానికులు వెంటనే తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లేసరికి ఆయన అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుని భార్య బానోతు జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కొడుకులు ఒక కుమార్తె ఉన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ గద్దె దిగే వరకు సిపిఐ పోరాటం ఆగదు

### సిపిఐ జనచైతన్య ప్రచార యాత్రలో సిపిఐ మహబూబాబాద్ మండల కార్యదర్శి తండ సందీప్ పిలుపు




**మహబూబాబాద్, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపుమేరకు నిర్వహిస్తున్న సిపిఐ ప్రజా చైతన్య ప్రచార యాత్రలో శుక్రవారం మహబూబాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో తిరిగి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ మండల కార్యదర్శి తండా సందీప్ మాట్లాడుతూ బిజెపి సర్కార్ మోడీ గద్దె దిగే వరకు సిపిఐ పోరాటం ఆగదన్నారు. బిజెపిని వచ్చే ఎన్నికల్లో ఓడించడానికి సిపిఐ ప్రచార యాత్రలు నిర్వహిస్తుందని పిలుపునిచ్చారు ఎక్కడికి వెళ్లినా బిజెపిని ఓడిస్తాం అని ప్రతిన భూమితున్న మండల ప్రజలు అని అన్నారు దేశంలో 12 ఏళ్ల పాలనలో మోడీ జీరో అన్నారు మోడీ ని దించడమే ఏకైక లక్ష్యం గా సిపిఐ పని చేస్తుందని రాబోయే ఎన్నికల్లో మోడీకి గుణపాఠం తప్పదని ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు నిర్ధారించారని అందుకు నిదర్శనం మధ్యప్రదేశ్ బీహార్లో జరిగిన ఉప ఎన్నికలే కారణం అన్నారు మొన్న ఢిల్లీలో విద్యార్థుల చేతుల్లో మోడీ పతనం ప్రారంభమైందని ఇక గుణపాఠం తప్పదు అన్నారు ఈ సందర్భంగా యాత్రలకు స్వాగతం పలుకుతున్న ప్రజలకు అభినందనలు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో చింతకుంట్ల వెంకన్న మామిళ్ల సాంబలక్ష్మి వీరవిల్లి రవి కేదాసు రమేష్ కొమ్ము నారాయణ కూరాకుల పాల్ తండ సందీప్ ఐలయ్య పులి యాకయ్య ప్రజానాట్యమండలి కళాకారులు, ఆయా గ్రామాల పార్టీ నేతలు పాల్గొన్నారు.

# పవిత్ర రామనామం స్మరిస్తే శుభం సర్వ సంపదలు ప్రాప్తం



**నర్సంపేట, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** సర్వాపురం గ్రామ నర్సంపేటలో శ్రీ సంతోషి మాతా దేవాలయంలో శ్రీరామ హృదయ కళశ పదవ రోజు నిర్వహించారు. పూజాదికాలనంతరం మన ఆచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళషాషనాలతో ఆలయ అర్చకులు దేవీ ఉపాసకులు శ్రీ గట్టు. నారాయణ చార్యులు భక్తులనుద్దేశించి మాట్లాడారు. శ్రీరామ హృదయ కళశము లులో బియ్యం సమర్పన చేయించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనులందరు అధ్యాత్మిక దారిలో ఉండాలని శ్రీరాముడు పురోషోతముడని దశవతారాల్లో ఏడవ అవతారం, సాక్షాత్ పరమశివుడే ఒకసారి రామ నామాన్ని ఉచ్చరించడం వల్ల మిగితా దేవుళ్ళను వెయ్యి సార్లు జపం చేసిన ఫలితం వస్తుందని అటువంటి మహా శక్తి రామ నామానికి ఉన్నదని బోయవాడు జ్ఞానోదమయి రామాయాణ గ్రంధాన్ని వ్రాసి వాల్మీకి అయ్యాడు, శ్రీరామచంద్రుడు మానవ జన్మ ఎత్తి ఎన్నో కష్టాలు పడ్డాడు, రాముడు ఏక పత్ని వ్రతుడు, తండ్రి మాట జవాదాటని వాడు, అన్నదమ్ముల అనుబందానికి భార్య భర్తల అనురాగానికి ప్రతీక, రాజ్యంలో ప్రజలను కన్న బిడ్డలవలే చూసుకున్నాడు సత్య వాక్కు పాలకుడు ఇవ్వన్నీ గుణాలు ఉన్నాయి కనుక శ్రీరాముడు అయ్యాడు, అనంతరం జీయర్ మంగళం తో మంగళశాషనాలు తీర్ధ ఘోష్టి తో పరిపూర్ణ మైనది, కార్యక్రమం లో వికాస తరంగిణి సభ్యులు సంతోషిమాత భక్త బృందం భక్తులు పాల్గొన్నారు..

# గ్రామాభివృద్ధే లక్ష్యం.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి!

**దుగ్గొండి, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** దుగ్గొండి మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం లో స్వర్గీయులు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సభను ప్రారంభించారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సేవాభావంతో ఉండాలని జడ్పీ సీఈఓ రాంరెడ్డి సూచించారు. శుక్రవారం దుగ్గొండి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ డాక్టర్ లెక్కల అరుంధతి ఆధ్వర్యంలో, మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో ముందు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి పట్ల సభ్యులు సంతాపం వ్యక్తం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలను వచ్చే రెండు నెలల పాటు మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు జడ్పీ సీఈఓ సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఇంకుడు గుంతలను వినియోగంలోకి తీసుకురావాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

### ఎరువుల అక్రమ విక్రయాలపై ప్రశ్నలు..

డీఏపీ ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం, యూరియాకు ఇతర పురుగుమందులను తప్పనిసరిగా లింక్ చేయడం వంటి అంశాలను బొబ్బరోనిపల్లి సర్పంచ్ శెంకషు కమలాకర్ సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి గాజుల శ్యామ్ స్పందిస్తూ, అక్రమాలకు పాల్పడుతున్న ఎరువుల దుకాణాల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అయితే, మండల వ్యవసాయ అధికారిగా ప్రత్యక్ష చర్యలు చేపట్టకుండా కేవలం ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పడంపై పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా విద్యార్థుల చేరికలు పెరిగాయని, గత పదో తరగతి ఫలితాల్లో మండలం జిల్లా టాపర్‌ను అందించిందని మండల విద్యాశాఖ అధికారి వెంకటరశ్వర్లు తెలిపారు. తిమ్మంపేట ప్రభుత్వ పాఠశాలలో ఒకే ఒక్క విద్యార్థి ఉండగా, గ్రామస్థులు, తల్లిదండ్రులతో చర్చించి ప్రస్తుతం 90 మంది విద్యార్థుల వరకు చేరికలు పెంచినట్లు సర్పంచ్ శ్రీలత వివరించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని ఆమె ప్రస్తావించగా, కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈఓ హామీ ఇచ్చారు.

### పారిశుద్ధ్య నిధులపై వాడివేడిగా చర్చ

కేశవపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 2023 నుంచి పారిశుద్ధ్య నిధులు అందడం లేదని వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ తెలిపారు. దీనిపై స్పందించిన నాచినపల్లి సర్పంచ్ పెండ్యాల రాజు, గ్రామ పంచాయతీలకు గత మూడు సంవత్సరాలుగా పారిశుద్ధ్య నిధులు విడుదల కావడం లేదని ఆరోపించారు. వ్యాధులు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తు నివారణ చర్యలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు వారి వారి వివరాలను సర్వసభ్య సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో సమ్మక్క, ఎంపీఓ చంద్రమోహన్ స్వామి, సొసైటీల చైర్మన్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల కుమారస్వామి గౌడ్, రాజేశ్వర్‌రావు, కిరణ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు డాక్టర్ కిరణ్ రాజు, ఏపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు,పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.








## ఉద్యమానికి సిద్ధాంత బలం అందించిన గొప్ప మేధావి జయశంకర్ సార్

**చిట్యాల, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల అధ్యక్షులు జన్నె యుగేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. తన జీవితమంతా తెలంగాణ సాధనే లక్ష్యంగా అంకితం చేసి ఉద్యమానికి సిద్ధాంత బలం అందించిన గొప్ప మేధావి అని పేర్కొన్నారు. జయశంకర్ సార్ చూపిన మార్గంలో నేటి తరాలు ముందుకు సాగాలని తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలను గుర్తుంచుకొని వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీ గౌరవ అధ్యక్షులు సాద మల్లయ్య ప్రధాన కార్యదర్శి కన్నబోయిన అశోక్ మండల ఉపాధ్యక్షులు జాలిగాపు కృష్ణయ్య మర్రి నరేష్ కోశాధికారి కంచర్ల కుమారస్వామి కార్యదర్శి పువ్వాటి హరికృష్ణ గౌరవ సలహాదారులు జంబుల చంద్రమౌళి కొత్త శ్రీను కార్యవర్గ సభ్యులు గురుకుంట్ల కిరణ్ ఉప్పుల కిరణ్ యువకులు అభిమానులు పాల్గొని జయశంకర్ సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## సకినాల మల్లయ్యకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు



**చిట్యాల, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండలం కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల మల్లయ్య హైదరాబాదులోని సిఎసిఎస్ కంపెనీలో గత కొన్ని సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన సేవలను గుర్తించిన సంస్థ యాజమాన్యం బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును మల్లయ్య కు శుక్రవారం అందజేశారు. ఈ అవార్డును బ్రాంచ్ మేనేజర్ వేపూరి కుమార్ చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ హైదరాబాదులో విధులు నిర్వహిస్తుండగా పనిని గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉంది అన్నారు. ఈ అవార్డుతో సంస్థలో ఇంకా బాధ్యత పెరిగింది అన్నారు. అవార్డు అందజేసిన మేనేజర్ జనరల్ మేనేజర్ ఆపరేషన్ మేనేజర్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజర్ ప్రదీప్ కుమార్ ప్రవీణ్ గోవర్ధన్ సైట్ ఎగ్జిక్యూటివ్ జ్యోతి సూపర్వైజర్స్ లక్ష్మణ్ ఆనంద్ ముబీనా తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ డీటిహెచ్ టెక్నీషియన్ల డివిజన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





**నల్లబెల్లి, ఆగస్ట్ 7 (పీపుల్స్ డైరీ) :** ఆల్ డీటీహెచ్ టెక్నీషియన్ల డివిజన్ కమిటీకి నూతన కార్యవర్గాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సంద విష్ణు, ఉపాధ్యక్షు డుగా సుధగని ప్రమోద్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా కొనకటి మహేష్, కోశాధికారిగా బైరాబోయిన సురేష్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను టెక్నీషి యన్లు అభినందిస్తూ, వారి నాయకత్వంలో డివిజన్ అభివృద్ధి చెందాలని, టెక్నీషియన్ల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, టెక్నీషియన్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వృత్తి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని, సభ్యులందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలి

### కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (పీపుల్స్ డైరీ) :** భారతదేశ ఆర్థిక వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) రూపకల్పనకు మార్గదర్శకుడైన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని భారత కరెన్సీ నోట్లపై ముద్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫోటో కరెన్సీ పై ముద్రించాలని, దేశ నిర్మాణంలో చేసిన సేవలు, ముఖ్యంగా సామాజిక, ఆర్థిక, రాజ్యాంగ రంగాల్లో ఆయన అందించిన విశిష్టమైన కృషిని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం ఎంపీ మల్లు రవి, ప్రొఫెసర్ కాసిము తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. తదుపరి డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్ప రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి ఆర్థికవేత్త అని అన్నారు. 1929లో ఆయన చేసిన ఆర్థిక పరిశోధనలు, ప్రతిపాదించిన ఆర్థిక సిద్ధాంతాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమైన మార్గదర్శకత్వాన్ని అందించాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు ఏర్పడిన సమయంలో భారతదేశానికి బలమైన ఆర్థిక వ్యవస్థ అవసరాన్ని అంబేద్కర్ తన ఆలోచనలు, పరిశోధనల ద్వారా ముందుగానే గుర్తించారని, ఆయన ఆర్థిక ఆలోచనలు భారతదేశంలో కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థకు బలమైన పునాది ఏర్పడటానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికే కాకుండా ప్రపంచంలోని అనేక దేశాలకు ఆర్థిక ఆలోచనల్లో దిశానిర్దేశం చేసిన మహోన్నత ఆర్థికవేత్త అని డాక్టర్ రామకృష్ణ అన్నారు. అంబేద్కర్ ఆర్థిక ఆలోచనలు, పరిశోధనలు, దేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో ఆయన చేసిన కృషిపై మరింత విస్తృతంగా అధ్యయనం చేసి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com